ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
బుధవారం 2 ఏప్రిల్ 2025



బాలిక హత్య కేసులో ముద్దాయికి ఉరిశిక్ష

- చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు

... మెయిన్‌లో



ముద్దాయి గుణశేఖర్

బైక్‌లను ఢీకొన్న కారు

ఇద్దరి మృతి

మరొకరికి గాయాలు

- సత్యవరం నుంచి రేబాక ఆలయం వద్దకు వెళుతుండగా ప్రమాదం



గొల్ల శివ (ఫైల్ ఫొటో)



కీర్తి చక్రరావు (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారిని కారు రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. జాతీయ రహదారిపై మండలంలోని గొడిచెర్ల జంక్షన్ వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటనలో మరొకరికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి సీఐ కె.కుమారస్వామి తెలిపిన వివరాలిలా వున్నాయి.

పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన కొంతమంది నక్కపల్లి మండలం రేబాక ఆలయం వద్ద మంగళవారం వేడుక పెట్టుకున్నారు. గ్రామానికి చెందిన కీర్తి చక్రరావు (41), గొల్ల శివ (45) ఒక బైక్‌పైన, కీర్తి రమణ మరో బైక్‌పై సత్యవరం నుంచి రేబాక బయలుదేరారు. గొడిచెర్ల హైవే జంక్షన్ దాటగానే వెనుక నుంచి వస్తున్న కారు, రెండు బైక్‌లను ఢీకొన్నది. ఒక బైక్‌పై వున్న చక్రరావు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన గొల్ల శివను తుని ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందాడు. మరో బైక్‌పై వున్న కీర్తి రమణ గాయపడ్డారు. మరో రెండు నిమిషాలు ప్రయాణిస్తే ఉద్దండపురం హైవే జంక్షన్‌కు చేరుకుని రేబాక రోడ్డులోకి ... మిగతా 8వ పేజీలో

పరిశ్రమల ఖిల్లాగా జిల్లా

వడివడిగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం

- ఏపీఐఐసీ ఆధీనంలో వేలాది ఎకరాలు
- ఐదేళ్లపాటు ఖాళీగా ఉంచేసిన వైసీపీ పాలకులు
- విపరీతంగా పెరిగిపోయిన తుప్పలు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కదలిక
- తుప్పలు తొలగించి మౌలిక వసతుల కల్పన
- పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయింపు
- ఐదేళ్లలో రూ.3.98 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- లక్షమందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



అనకాపల్లి మండలం కోడూరులో పారిశ్రామిక పార్కు కోసం ఏపీఐఐసీ సేకరించిన భూమిలో రహదారుల నిర్మాణం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఆర్థిక వృద్ధి, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, సుస్థిరత ప్రధానాంశాలుగా స్వర్ణాంధ్ర-2047పై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. సుదీర్ఘ సముద్ర తీరం, రైలు, రోడ్డు రవాణా మార్గాలు అందుబాటులో ఉండడంతో జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి, అనకాపల్లి, నక్కపల్లి మండలాల్లో ఏపీఐఐసీ ఆధీనంలో వున్న భూములను పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించేందుకు ఆయా ప్రాంతాల్లో శరవేగంగా మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

పరిశ్రమలు, కంపెనీల ఏర్పాటు కోసం గతంలో ఏపీఐఐసీ సేకరించిన భూములను గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వృథాగా వుంచేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇటువంటి భూములను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ విజయకృష్ణన్ నేతృత్వంలో ఏపీఐఐసీ భూముల అభివృద్ధితో పాటు కొత్త పరిశ్రమల ఏర్పాటుకు శరవేగంగా చర్యలు చేపడుతున్నారు. అచ్యుతాపురం సెజ్ పరిధిలోని రాంబిల్లి క్లస్టర్, అనకాపల్లి మండలం కోడూరు, సిరసపల్లి, వల్లూరుల్లో ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న భూములను పరిశ్రమల ఏర్పాటు కోసం ఔత్సాహికులకు ప్లాట్లుగా కేటాయిస్తున్నారు. పెద్ద పరిశ్రమలకు అనుబంధంగా చిన్న, మధ్య తరగతి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

వల్లూరులో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు

పారిశ్రామిక పార్కు కోసం అనకాపల్లి మండలం వల్లూరులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 350 ఎకరాలను సేకరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిశ్రమల ఏర్పాటుకు కనీసం చర్యలు చేపట్టలేదు. దాదాపు ఐదేళ్లపాటు భూములు వృథాగా పడివుండడమే కాకుండా తుప్పలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఈ భూములను మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు కేటాయించింది. లాజిస్టిక్ పార్కు ఏర్పాటు కోసం ఢిల్లీకి చెందిన ఒక ప్రముఖ కంపెనీ ప్రతినిధులు ఇటీవల వచ్చి పరిశీలించి వెళ్లారు. ఈ భూముల్లో విపరీతంగా పెరిగిపోయిన తుప్పలను తొలగించి పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల (నీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీలు) పనులు చేపడుతున్నారు. లాజిస్టిక్ పార్కు ఏర్పాటైతే వందలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి లభిస్తాయి. అనకాపల్లి మండలం కోడూరు సెజ్‌లో నేషనల్ ఫార్మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (నైపర్) ఏర్పాటుకు భూ కేటాయింపులు జరిపారు. ఆయా సంస్థలు త్వరలోనే పనులు ప్రారంభించనున్నాయి.

అచ్యుతాపురం సెజ్‌కు క్యూ కడుతున్న పరిశ్రమలు

అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పరిధిలోని రాంబిల్లి క్లస్టర్‌లో ఏపీఐఐసీ ఆధీనంలో 2,500 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. వైసీపీ హయాంలో ఖాళీగా వున్న ఈ భూముల అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించింది. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ రాంబిల్లిలో యూనిట్ ఏర్పాటుకు సిద్ధమవుతున్నది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.లక్ష 85 వేల కోట్లతో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల సరిహద్దులో గ్రీన్ హైడ్రోజన్ పార్కు ఏర్పాటు చేయనున్నారు. ఐనాక్స్ ఎయిర్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.145 కోట్లతో ... మిగతా 8వ పేజీలో

ఐదేళ్లలో రూ.3.98 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యం



రానున్న ఐదేళ్లలో జిల్లాలో రూ.3.98 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యంగా పలు రకాల పరిశ్రమలను ఏర్పాటు చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నది. ఇందులో భాగంగా భూముల కేటాయింపు కోసం పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు చేసుకున్న దరఖాస్తులను కలెక్టర్ నేతృత్వంలో ఏపీఐఐసీ అధికారులు పరిశీలిస్తున్నారు.

- జి.నాగరాజారావు, జీఎం, జిల్లా పరిశ్రమల కేంద్రం

గోవాడ షుగర్స్‌లో మరో నాలుగు రోజులే క్రషింగ్

- 5వ తేదీతో నిలిపివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటన
- ఇంతవరకు 98 వేల టన్నుల చెరకు క్రషింగ్



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్స్‌లో ఈ నెల ఐదో తేదీ వరకే చెరకు క్రషింగ్ జరుగుతుందని యాజమాన్యం మంగళవారం ప్రకటించింది. రైతులు తమపొలాల్లో వున్న చెరకు సత్వరమే ఫ్యాక్టరీకి తరలించాలంటూ అన్ని కాటాల వద్ద నోటీసులు అంటించారు. షుగర్ ఫ్యాక్టరీలో ఈ ఏడాది జనవరి 21వ తేదీన రెగ్యులర్ క్రషింగ్‌ను ప్రారంభించారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా క్రషింగ్‌కు పలుమార్లు అంతరాయం ఏర్పడింది. దీంతో ఫ్యాక్టరీ యార్డులో, కాటాల వద్ద చెరకు బండ్లతో రైతులు రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. సహనం నశించి కొన్నిసార్లు ఆందోళనలకు కూడా దిగారు. కాగా మంగళవారం నాటికి 98 వేల టన్నుల చెరకు క్రషింగ్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పొలాల్లో అందుబాటులో ఉన్న చెరకు క్రషింగ్ చేస్తే మరో ఏడెనిమిది వేల టన్నుల వరకు క్రషింగ్ జరిగే అవకాశం వుంది.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- బల్క్‌డ్రగ్ పార్కు, స్టీల్ ప్లాంట్‌లతో 50 వేల మందికి ఉద్యోగాలు
- హోం మంత్రి వంగలపూడి అనిత

- 8లో

తిరుపతి, షిర్డీ రైళ్లు ఫుల్

- మే నెలాఖరు వరకూ బెర్తు లభించే పరిస్థితి లేదు
- డబుల్ డెక్కర్, తిరుపతి ప్రత్యేక రైలులో మాత్రమే ఖాళీలు



విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్‌లో తిరుపతి, షిర్డీ రైళ్లలో బెర్తులు లభించడం గగనంగా మారింది. ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని 120 నుంచి 60 రోజులకు కుదించిన నేపథ్యంలో మరింత డిమాండ్ పెరిగింది. ప్రతి గురువారం విశాఖ నుంచి సికింద్రాబాద్ మీదుగా షిర్డీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ (18503), అలాగే ప్రతి ఆదివారం విశాఖ నుంచి రాయపూర్, మన్మాడ్ జంక్షన్ మీదుగా నడిచే ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847)లకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. అదేవిధంగా తిరుపతి వెళ్లేందుకు ఉన్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (18521), హౌరా-బెంగళూరు (12863), పూరి-తిరుపతి, బిలాస్‌పూర్-తిరుపతి, వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504) వంటి రోజువారీ రైళ్లతోపాటు వారాంతపు, బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏడాది పొడవునా డిమాండ్ ఉండడంతో ప్రయాణికులు ఆశించిన తేదీల్లో బెర్తులు పొందలేని పరిస్థితులు నెలకొన్నాయి.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నెలాఖరు వరకు ఫుల్

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు మే నెలాఖరు ... మిగతా 8వ పేజీలో

మిర్చి రైతుకు తెగుళ్ల ఘాటు

పూత దశలోనే చీడపీడలు

- మందులు పిచికారీ చేసినా నివారణకాని వైనం
- నాలుగో వంతుకు పడిపోయిన మిర్చి దిగుబడి
- పెట్టుబడులు సైతం రాని పరిస్థితి



చౌడువాడలో తెగుళ్లు సోకిన మిరప తోట

కోటవురట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): **మిర్చి రైతుకు ఈ ఏడాది కలిసి రాలేదు. మొక్క దశలో వున్నప్పుడే పలు రకాల తెగుళ్లు ఆశించాయి. వీటి నివారణ కోసం మార్చిమార్చి మందులు పిచికారీ చేసినప్పటికీ పెద్దగా ఫలితం లేకపోయింది. ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి వుండగా ఇందులో మూడో వంతు కూడా రాలేదు. మార్కెట్‌లు ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో పెట్టుబడి కూడా దక్కలేదని రైతులు వాపోతున్నారు.**

జిల్లాలో మిర్చి పంట సాగయ్యే మండలాల్లో కోటవురట్ల మొదటిస్థానంలో వుంది. మండలంలోని కైలాసపట్నం రాజుపేట, చౌడువాడ, గొట్టివాడ, కోటవురట్ల, కొడవటిపూడి, కె.వెంకటాపురం, లింగాపురం, తదితర గ్రామాల్లో బోర్ల కింద దాదాపు 200 ఎకరాల్లో మిర్చి పంటను పండిస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 15 క్వింటాళ్లమేర ... మిగతా 8వ పేజీలో

పెట్టుబడి వస్తుందన్న ఆశ లేదు



నేను ఎకరా భూమిలో మిరప సాగు చేపట్టాను. ఇప్పటికే రూ.50 వేలు పెట్టుబడి అయ్యింది. గతంలో కంటే ఈ ఏడాది తెగుళ్లు అధికమయ్యాయి. వీటి నివారణ కోసం తరచూ మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. దీంతో ఖర్చులు పెరిగాయి. కానీ దిగుబడి బాగా తగ్గిపోయింది. మిర్చి ధర సైతం ఆశాజనకంగా లేదు. పెట్టుబడి వస్తుందన్న నమ్మకం కూడా లేదు.

- కరెడ్ల నాగేశ్వరరావు, మిర్చి రైతు చౌడువాడ,

ఆస్తి పన్ను వసూళ్లలో రికార్డ్

రాష్ట్రంలో 8వ స్థానంలో నర్సీపట్నం మునిసిపాలిటీ

- గత ఆర్థిక సంవత్సరం కంటే 19.7 శాతం అధికం
- లక్ష్యం రూ.7.43 కోట్లు.. వసూలైంది రూ.5.67 కోట్లు
- ఫలించిన 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటన
- చివరి ఆరు రోజుల్లో రూ.68 లక్షలు వసూలు

నర్సీపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):



నర్సీపట్నం మునిసిపల్ కార్యాలయం

ఆస్తి పన్ను వసూళ్లలో నర్సీపట్నం మునిసిపాలిటీ రికార్డు సృష్టించింది. రాష్ట్రంలోని వివిధ మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఆస్తి పన్ను వసూళ్లలో నర్సీపట్నం ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఆస్తి పన్నుపై విధించి వడ్డీపై ప్రభుత్వం గత నెల 26 తేదీన 50 శాతం రాయితీ ప్రకటించడంతో పన్నుల వసూళ్లు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. కేవలం ఆరురోజుల్లోనే రూ.68 లక్షలు వసూలు కావడం విశేషం. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ రాత్రి పది గంటల వరకు మునిసిపల్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండి పన్నులు కట్టించుకున్నారు. దీంతో ఈ నెల 30వ తేదీన రూ.30 లక్షలు వసూలైంది. మునిసిపాలిటీ ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులు, ఖాళీ స్థలాలకు 15,516 అసెస్‌మెంట్లు వున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.7.43 కోట్లు ఆస్తి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా రూ.5.67 కోట్లు వసూలైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.4.73 కోట్లు వసూలు చేశారు. దీనికంటే 12.5 శాతం అదనంగా వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించగా 19.7 శాతం వసూళ్లు సాధించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందిని, సచివాలయాల ఉద్యోగులను కమిషనర్ సురేంద్ర అభినందించారు.

తొలిరోజు 94.87 శాతం పింఛన్లు పంపిణీ



గొలుగొండ మండలం గుండుపాలలో మహిళకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ మంగళవారం ఒక్క రోజులోనే 94.87 శాతం పూర్తయ్యింది. డీఆర్‌డీఏ పీడీ శచీదేవి అందించిన వివరాల ప్రకారం.. జిల్లాలో 2,56,072 మందికి వివిధ రకాల పింఛన్ల రూపంలో రూ.108 కోట్లు మంజూరయ్యాయి. ఒకటో తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల సిబ్బంది తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి 2,43,580 (94.87 శాతం) మందికి పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పంపిణీకి అవకాశం ఉన్నందున గడువులోగా అందరికీ డబ్బులు అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు. కాగా పింఛన్‌ల పంపిణీలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. గొలుగొండ మండలం గుండుపాలలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పాయకరావుపేట మండలం అరట్లకోటలో హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, పరవాడ మండలం వాడచీపురుపల్లిలో కలెక్టర్ విజయకృష్ణన్ లబ్ధిదారులకు పింఛన్‌లు డబ్బులు అందజేశారు.



నామవరం సమీపంలో జాతీయ రహదారి పక్కన వరుసగా నిలుపుదల చేసిన భారీ కంటైనర్లు

హైవేపైనే కంటైనర్ల పార్కింగ్

పాయకరావుపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. హోటళ్లు, దాబాలు వున్నచోట ఈ సమస్య ఎక్కువగా వుంది. పాయకరావుపేట మండలం నామవరం జంక్షన్ సమీపంలో ఒక దాబా వుంది. దీని లోపల వాహనాల పార్కింగ్‌కు స్థలం వున్నప్పటికీ భారీ కంటైనర్ల డ్రైవర్లు రోడ్డుపక్కనే నిలుపుదల చేశారు. అనకాపల్లి నుంచి పాయకరావుపేట వరకు ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రదేశం నామవరం జంక్షన్‌గా పోలీసు రికార్డుల్లో వుంది. అటువంటి డేంజర్ జోన్‌లో రోడ్డు పక్కన భారీ వాహనాలు నిలుపుదల చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అయోధ్య రథయాత్రలో రామభక్తి చాటాలి

» ఎలమంచిలి పురపాలక చైర్‌పర్సన్ రమాకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న రమాకుమారి

మునగపాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలం నుంచి మొదలు కానున్న అయోధ్య రథయాత్రలో రామభక్తిని చాటుకోవాలని ఎలమంచిలి పురపాలక సంఘం చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పిలుపునిచ్చారు. స్థానిక తులసీ కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం రథయాత్రపై పలువురు ప్రముఖులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్యలో రూపొందించిన రథం తొలి పర్యటన నియోజకవర్గంలో జరగడం అదృష్టంగా భావించాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, బద్దెం సూర్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, వేగి కృష్ణ, ఆడారి లక్ష్మణరావు, ఆడారి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు

రాంబిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జయమాధవి తెలిపారు. మండలంలో 353 మంది రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వారందరికీ ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

నేడు హరిపురం జనసేన కార్యాలయంలో జనవాణి

రాంబిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆధ్వర్యంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు హాజరవుతున్నారన్నారు. ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ కార్యక్రమం జరగనుందన్నారు.

పాడిరైతులకు దాణా గిన్నెలు పంపిణీ



పాడిరైతులకు దాణా గిన్నెలు అందజేస్తున్న రమాకుమారి

రాంబిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా విశాఖ డైయిరీ పనిచేస్తుందని డైయిరీ డైరెక్టర్ పి.రమాకుమారి అన్నారు. సోమవారం ఆమె విశాఖ డెయిరీ మంజూరు చేసిన దాణాగిన్నెలను దిమిలి పాల సంఘంలోని 275 మంది పాడి రైతులకు పంపిణీ చేశారు. అనంతరం రమాకుమారి మాట్లాడుతూ విశాఖ డెయిరీ ద్వారా అమలు అవుతున్న ప్రయోజనాలను పాడిరైతులకు వివరించారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు సిగిరెడ్డి నాయుడు, పాడిరైతులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యనారాయణస్వామి జయంతి



మత్స్యనారాయణస్వామికి పూజలు చేస్తున్న మత్స్యకార నేతలు

రాంబిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం లోని ఎఫ్‌పీవో కార్యాలయంలో మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మత్స్యనారాయణస్వామి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటానికి మాజీ సర్పంచులు చింతకాయల ఎర్రయ్య, చోడిపల్లి సత్యనారాయణ, ఎరిపిల్లి చిట్టిబాబు, పలువురు మత్స్యకార నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం, ప్రభుత్వయేతర సంస్థలు పనిచేయాలని పిలుపునిచ్చారు. మత్స్యకారులకు జీవనోపాధి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం చూపించాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి నేతలు సూరాడ నూకరాజు, ఎరిపిల్లి అజయ్, సూరాడ వెంకన్న, చెల్లూరి కొండబాబు, ఉమ్మిడి నాగేష్, చోడిపిల్లి మంగరాజు, ఎరిపిల్లి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి మృతితో సత్యవరంలో విషాదఛాయలు



గోళ్ల శివ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం నక్కపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన గోళ్ల శివ, కీర్తి చక్రరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరిద్దరూ వ్యవసాయ కూలీలు. తమలపాకులు కోత పనికి వెళుతూ జీవనం సాగిస్తుంటారు. శివకు కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు. చక్రరావుకు ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. కూలి పని చేసుకుంటేనే గానీ గడవని కుటుంబాలు కావడంతో కుటుంబ యజమాని చనిపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నవోదయకు సుంకపూర్ విద్యార్థి ఎంపిక

కోటవురట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకపూర్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న పీ.కౌశిక్ జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన కౌశిక్‌ను ఎంఈవోలు రామారావు, జోషి, పాఠశాల హెచ్‌ఎం విశ్వేశ్వరరావు అభినందించారు.



నవోదయ పాఠశాలకు ఎంపికైనా కౌశిక్‌ను అభినందిస్తున్న ఎంఈవోలు

సెజ్ పునరావాస కాలనీలో సమస్యల తిష్ట

» ఐదేళ్ల పాలనలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

» నీరు రాని కొళాయిలు... పూడిక తీయని కాలువలు

» దోమలతో కాలనీవాసుల సహవాసం



సెజ్ పునరావాస కాలనీ ఏరియల్ వ్యూ

అచ్యుతాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం) వాసులు సమస్యలతో సతమతమవుతున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలకు చెందిన 24 గ్రామాల నిర్వాసిత రైతులకు 500 ఎకరాలు పునరావాస కాలనీ (దిబ్బపాలెం పంచాయతీ) ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో 4,500 కుటుంబాలు కాపురముంటున్నాయి. రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుచేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ కాలనీ గురించి అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం మానేశారు. దీంతో ఐదేళ్లలో నిర్వాసిత రైతులు సౌకర్యాల కోసం పలు దఫాలు ఆందోళనలు చేయాల్సి వచ్చింది. ఈ సమయంలో నిర్వాసితులు కాని చాలా మందికి ఈ కాలనీలో నిర్వాసితుల పేరిట ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చేశారు. ఇంకా నిజమైన నిర్వాసిత రైతులకు ఇళ్ల స్థలాలు రాక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇన్ని సమస్యల మధ్య నలుగుతున్న సమయంలో 2024 ఎన్నికలు వచ్చాయి. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కాలనీని దత్తత తీసుకొని అన్ని సౌకర్యాలు కల్పిస్తామని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ ఎన్నికల ప్రచారంలో వాగ్దానాలు చేశారు. అయినా ఇంతవరకు ఈ కాలనీ గురించి పట్టించుకోలేదు. కొళాయిల ద్వారా నీరు రావడం లేదు. వచ్చినా నీటిపై సున్నపు నీరు తెట్టు కడుతోంది. కాలువల్లో పూడికలు తీయకపోవడంతో మురికి నీరు పేరుకుపోయి దోమలు విజృంభిస్తూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా నాయకులు తమ కాలనీ వైపు చూడాలని కోరుకుంటున్నారు.



కాలువల్లో నిలిచిన మురికి నీరు



నీరు రాని కొళాయి

కాలనీలో కనీస సౌకర్యాలు లేవు

రాజాన విజయ్, ఉప సర్పంచ్ దిబ్బపాలెం



తాము సెజ్‌కి భూములు ఇవ్వడం వల్లే ఈప్రాంతానికి ఇంత పేరు వచ్చింది. తాము సర్వం కోల్పోయి అనాథలుగా జీవిస్తున్నాం. సాగు చేయడానికి భూమి లేదు.. కర్మాగారాల్లో ఉపాధి లేదు... ఒకప్పుడు సాగు చేసే రైతులు ప్రస్తుతం కర్మాగారాల్లో కలాసీలుగా పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. కాలనీలో కనీస సౌకర్యాలు కూడా లేవు. ప్రస్తుత ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

లోకేశ్ పర్యటనతో టీడీపీలో జోష్

» ప్రశంసాపత్రాలతో నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం

» ఇలా గుర్తింపునిస్తే పార్టీ మరింత పటిష్టం

ఎలమంచిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి లోకేశ్ పర్యటన కార్యకర్తలు, నాయకుల్లో జోష్ నింపింది. సోమవారం అచ్యుతాపురంలో కార్యకర్తలు, నేతలతో జరిగిన సమావేశంలో మంత్రి లోకేశ్ మూడు గంటలపాటు నియోజకవర్గ సమస్యలతోపాటు కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకోవడంపై ఆనందం వ్యక్తమవుతోంది. పార్టీ ఆదేశాలనుసారం సేవలందించిన వారికి ప్రశంసా పత్రాలు ఇచ్చి గుర్తించడంపై కార్యకర్తలు, నేతలు ఉబ్బితబ్బిబవుతున్నారు. ఇదేవిధంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలను చేపడితే పార్టీ మరింత పటిష్టమవుతుందని



మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న టీడీపీ కార్యకర్త కరణం రవి(ఫైల్)

వారంటున్నారు. ప్రశంసాపత్రాలు పొందడం ఎంతో ఆనందంగా ఉందని, రెట్టించిన ఉత్సాహంతో పార్టీకి సేవలందిస్తామని మునిసిపాలిటీలోని యర్రవరం వార్డుకు చెందిన టీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ కరణం రవి అన్నారు. కార్యకర్తలకు ఎనలేని గుర్తింపు ఇచ్చేందుకు టీడీపీ అధినాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

వెలంపాలెంలో గ్రావెల్ అక్రమ దందా

» సోమవారం రాత్రి భారీగా గ్రావెల్ రవాణా

» యంత్రాల సాయంతో తవ్వి లారీలు, ట్రాక్టర్లతో తరలింపు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగులూరు పంచాయతీలో గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. వెలంపాలెంలో ఉన్న కొండకు అతి సమీపంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు చేశారు.. గ్రావెల్‌ను లారీలతో దూర ప్రాంతాలకు, ట్రాక్టర్లతో చుట్టు పక్కల ప్రాంతాలకు తరలిస్తున్నట్టు గ్రామానికి చెందిన పలువురు తెలిపారు. అయితే ఈ గ్రావెల్ దందా అంతా ఓ రాజకీయ నాయకుడి కనుసన్నల్లోనే జరుగుతోందని గ్రామస్థులు ఆరోపించారు. ట్రాక్టర్ లోడ్ దూరాన్ని బట్టి రూ.మూడు వేల నుంచి మొదలుకొని పెద్ద మొత్తంలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దూర ప్రాంతాలకు లారీలతో తరలించే గ్రావెల్‌కు ఇంకెంత దోచుకుంటున్నాడో తెలియదని గ్రామస్థులు అంటున్నారు. ఇదిలావుంటే తవ్వకాలు జరిగిన సమీపంలో ఓ లేఅవుట్‌లో ఉన్న స్థలానికి ఆ గ్రావెల్‌ను రాజకీయ నాయకుడు రూ. కొన్ని లక్షలకు కాంట్రాక్టు తీసుకొని కప్పించాడని చెబుతున్నారు. ఇటీవల వేమగిరిలో జరిగిన మట్టి తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో ఆ రాజకీయ నాయకుడు పగటి పూట తవ్వకాలు ఆపేశాడు. కొద్ది రోజుల నుంచి రాత్రి సమయంలో ఎవరికి తెలియకుండా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నాడు.



గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన మరో ప్రదేశం

గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు

జె.రమేష్‌బాబు, తహసీల్దార్

వెలంపాలెంలో గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. గ్రావెల్, మట్టి అక్రమంగా తవ్వితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. వెలంపాలెంలో తవ్వకాలు జరిపిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించి, చర్యలు తీసుకుంటాను.

ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్న వారికే పీఎం కిసాన్

» జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్న వారికే పీఎం కిసాన్ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 9,792 మంది రైతులుండగా.. ఇప్పటివరకు కేవలం 4,789 మంది ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్నారన్నారు. మే నెలలో 20వ విడత పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాలకు జమ అవుతాయని, అందువల్ల రైతులంతా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎలమంచిలి ఏడీఏ సి.సుమంత, శంకర్ గోవింద్, ఏఈఓ కేటీ సూర్యనారాయణ, వ్యవసాయ సహాయకులు రాజ్ కుమార్, నీరజ, నవ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహన రావు:

అరట్లకోటలో మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం



అరట్లకోటలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత. చిత్రంలో గెడ్డం బుజ్జి, శ్రీప్రకాశ్ విద్యా సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యతోపాటు గ్రామాలలో తాగునీటిని అందిస్తున్న శ్రీప్రకాశ్ విద్యాసంస్థలు తమ సేవలను మరింతగా విస్తరించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని అరట్లకోటలో మంగళవారం శ్రీప్రకాశ్ విద్యా సంస్థల పూర్వ ట్రెజరర్ కీర్తి శేషులు కె. రామకృష్ణారావు జ్ఞాపకార్థం ఆ సంస్థల అధినేత సీహెచ్‌వీకే. నరసింహారావు రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్లాంట్ నిర్మించడం ఆనందదాయకమన్నారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాశ్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థల ఆధ్వర్యంలో పీఎల్.పురం, గుంటపల్లి, అరట్లకోటల్లో వాటర్ ప్లాంట్లు నిర్మించామన్నారు. అనంతరం హోంమంత్రి అనితకు శ్రీప్రకాశ్ విద్యాసంస్థల అధినేత సీహెచ్ నరసింహారావు జ్ఞాపికను అందించి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేశ్, సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, నాయకులు ఎం.రమాకుమారి, కట్టా శ్రీను, కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



కొత్తపేట జడ్పీ హైస్కూల్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి 13 వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులు చివరి పరీక్ష రాసి ఉత్సాహంగా పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చి సందడి చేశారు. మండలంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను 1,158 మంది విద్యార్థులు రాశారు. పట్టణంలో తులసీనగర్ బాలికల ఉన్నత పాఠశాల, కొత్తపేట జడ్పీ హైస్కూలు, సెయింట్ మేరీస్, శ్రీచైతన్య స్కూల్లో పరీక్షలు నిర్వహించారు. ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా పరీక్షలు పూర్తికావడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

కోటవురట్లలో..

మండలంలో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరిగాయి. అలాగే పాములవాక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నర్సీపట్నం మండలం వేములపూడి జడ్పీ హైస్కూల్‌లోను, మోడల్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు రాశారు. కె.వెంకటాపురం, జల్లూరు, కస్తూర్బా విద్యాలయాల విద్యార్థులు రెండు కేంద్రాల్లో పరీక్షలు రాశారు.

వాడ్రాపల్లిలో ఉపాధి పనులు ప్రారంభం



వాడ్రాపల్లిలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు మొదలయ్యాయి. గ్రామంలో చిన ఆవ కాలువ వద్ద వరదకట్ట (గట్టు) నిర్మాణ పనులను జాబ్ కార్డు దారులు మంగళవారం చేపట్టారు. అంతకుముందు పని ప్రాంతంలో భూమిపూజ చేశారు. తెలుగు ఆర్థిక సంవత్సరం మొదలు కావడంతో జాబ్‌కార్డుదారులు అందరూ పనిలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో కూటమి శ్రేణులు మళ్ల వరహా నర్సింగరావు, కొయిలాడ దశావతారం, కాండ్రేగుల నూకఅప్పారావు, మళ్ల శేషు, సూరిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభానికి పిలవలేదు

» గొర్లె ధర్మవరం సర్పంచ్ గొర్లె అశ్విని

అచ్యుతాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండా అధికారులు చెరువులో ఉపాధి పనులు మంగళవారం ప్రారంభించారని గొర్లె ధర్మవరం సర్పంచ్ గొర్లె అశ్విని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కార్యక్రమం జరిగినా అంతా కలిసికట్టుగా చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చెబుతున్నా గ్రామస్థాయిలో నాయకులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. అధికారులు కూడా గ్రామ నాయకులకు వంత పాడుతున్నారని, నిబంధనలు పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. ప్రోటోకాల్ ప్రకారమైనా సర్పంచ్‌ని పిలవకపోవటం శోచనీయమన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తానన్నారు.

ఘనంగా భావనారుషి, భద్రావతిల కల్యాణం

అచ్యుతాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీల ఆరాధ్యదైవం భద్రావతి సమేత భావనారుషి కల్యాణం సోమవారం రాత్రి దుప్పితూరులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానికులే కాకుండా అనకాపల్లి, విశాఖపట్నంల నుంచి పద్మశాలీ కులస్థులు, పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఏపీ రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఈ కల్యాణంలో పాల్గొన్ని దర్శించుకున్నారు. అలాగే కమిటీ చైర్మన్ మాడెం సూరి అప్పారావు, సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

రొయ్యల పరిశ్రమ ఎదుట నిరసన



రొయ్యల పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయి మెరైన్ రొయ్యల పరిశ్రమకు చెందిన వ్యర్థ జలాలను పంట కాలువలు, చెరువుల్లోకి విడుదల చేస్తుండడాన్ని నిరసిస్తూ గుడివాడ గ్రామస్థులు మంగళవారం రొయ్యల పరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎస్.వెంకటరాజు, గుడివాడ సర్పంచ్ ధూళి శ్రీనివాసరావు మాట్లాడుతూ రొయ్యల కంపెనీ యాజమాన్యం వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా విడుదల చేయడం తగదన్నారు. దీనివల్ల పంట కాలువలు, చెరువులు పూర్తిగా కలుషితమవుతున్నాయన్నారు. వ్యర్థ జలాల నుంచి వచ్చే దుర్వాసనకు ప్రధాన రహదారిపై వెళుతున్న వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రొయ్యల పరిశ్రమ యాజమాన్యం వెంటనే స్పందించి వ్యర్థ జలాలను బయటకు విడుదల చేయకుండా చూసుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రొయ్యల పరిశ్రమ ప్రతినిధికి అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న వెంకటేశ్

నక్కపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక,చినతీనార్ల గ్రామాలకు చెందిన రెండు కుటుంబాల వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ అందజేశారు. హోం మంత్రి అనిత సూచనల మేరకు రేబాకకు చెందిన బవిరిశెట్టి సత్యవతికి రూ. 81 వేలు, చినతీనార్లకు చెందిన కోడ ముసలయ్యకు రూ. 98,299 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరణం సూరిబాబు, గరికిన నూకరాజు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

నక్కపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక శివారు మనబాలవానిపాలెం గ్రామం వద్ద హైవేకు ఆనుకుని వున్న దుర్గమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. అయితే సోమవారం సాయంత్రమే నిర్వాహకులు ఆలయంలోని హుండీలను తెరిచి సొమ్ము లెక్కించారు. సోమవారం అర్ధరాత్రి దొంగ ఆలయం తలుపులు పగులగొట్టి, గుడిలో వున్న హుండీని గునపంతో పగులగొడుతున్న దృశ్యం సీసీ కెమెరాల్లో నమోదైంది. హుండీల్లో సొమ్ము ఏమీ లేనప్పటికీ దొంగను పట్టుకోవడానికి సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం బృందం ఆలయంలో ఆధారాలు సేకరించింది.

వాడవాడలా పెన్షన్ల పంపిణీ



గొల్లలపాలెంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ

ఎలమంచిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం పెన్షన్లు పంపిణీ ప్రారంభమయ్యాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పెన్షన్లను పంపిణీ చేశారు. మునిసిపాలిటీ 22వ వార్డు గొల్లలపాలెంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ నూతన పెన్షన్లను పంపిణీ చేశారు. రామ్‌నగర్‌లోని జనసేన పార్టీ నేత కొఠారు శ్రీను, యర్రవరంలో కరణం రవి, తదితర నేతలు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ సెక్రటరీలు పాల్గొన్నారు.



ఒక చోట కలిసిన 1980-81 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లి సెయింట్ థెరెసా ఆర్సీఎం పాఠశాలలో 1970-1995 బ్యాచ్‌లలో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. దేశ, విదేశాల్లో ఉన్న సుమారు రెండు వేలకు పైగా పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెదబొడ్డెపల్లి జంక్షన్ నుంచి ఆర్సీఎం పాఠశాల వరకు ర్యాలీగా వెళ్లి, ఆర్‌సీఎం విద్యాసంస్థ పేరు ప్రఖ్యాతలు పొందేందుకు ఎనలేని కృషి చేసిన ఇన్నయ్య, జోజిబాబు పాదర్ల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం ఉదయం నుంచి సాయంత్రం వరకు సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న రోజుల్లో పూర్వ విద్యార్థుల సంఘాన్ని మరింత పటిష్ఠం చేసి, ఆర్సీఎంను ఫౌండేషన్‌గా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన కార్యాచరణను ఖరారు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అప్పట్లో విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు పాపారావు, ఆనందరావు, శంకరరావులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేయించాలి



నర్సీపట్నంలో శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

నర్సీపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నంలో ఐక్య క్రైస్తవ సమాజం ఆధ్వర్యంలో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీబీఎం కాంపౌండ్ నుంచి శ్రీకన్య కూడలి వరకు జరిగిన ర్యాలీలో ప్రవీణ్‌కుమార్ మృతిపై విచారణ చేయించాలని, పాస్టర్లకు, క్రైస్తవులకు, ప్రార్థనా మందిరాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వితంతువులకు సొంతంగా పింఛన్లు

చీడికాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వితంతు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి అండగా ఉంటామని వైఎస్ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, జేబీ.పురం సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు భరోసా ఇచ్చారు. మండలంలో జేబీ.పురంలో వితంతువులు మిస్కా శ్యామల, శెట్టి నాగరాజమ్మ, ధర్మిశెట్టి రమణమ్మ, బల్లి దేముళ్లమ్మ, యలమంచిలి అప్పలకొండమ్మ, మిస్కా దేముడమ్మ, బాలిబోయిన చిన్నమ్మలకు ఒకొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున వారి సొంత నిధులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పది నెలలుగా ప్రభుత్వ పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా.. వారికి మంజూరు కాలేదని, మాకు వచ్చే గౌరవ వేతనాన్ని వితంతువులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, ధర్మిశెట్టి కొండబాబు, హైస్కూల్ కమిటీ చైర్మన్ మిస్కా అప్పారావు యాదవ్, అచ్చిబాబు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా.. ముందుంటా!

సకల సదుపాయాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల దినదినాభివృద్ధి చెందుతోంది. సదుపాయాలు.. ప్రవేశాలు.. ఫలితాల్లో ముందంజలో ఉంటోంది. అన్నింట్లోనూ గత ఏడాది జిల్లాలోనే టాప్‌లో నిలిచింది. తాజాగా నూతన ప్రవేశాలకు స్వాగతం పలుకుతోంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల దినదినాభివృద్ధి

సదుపాయాలు.. ప్రవేశాలు.. ఫలితాల్లో టాప్

గత ఏడాది 88 శాతం ప్రవేశాలతో జిల్లాలోనే ముందంజ

డిగ్రీ, పీజీతో కలిపి 699 విద్యార్థులు.. 75 శాతానికిపైగా ఉత్తీర్ణత

30 కంప్యూటర్లతో ల్యాబ్.. 15 వేల పుస్తకాలతో గ్రంథాలయం

నర్సీపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నానికి ఎన్టీఆర్ హయాంలో అయ్యన్నపాత్రుడు కృషితో 1985లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరైంది. అంతకు ముందు ఇంటర్ తర్వాత కాకినాడ, అనకాపల్లి వెళ్లి చదువుకోవల్సి వచ్చేది. అంత దూరం వెళ్లి చదువుకోలేని వారు ఇంటర్ తర్వాత ఉన్నత చదువులను ఆపేసేవారు.

ప్రస్తుతం డిగ్రీలో 611, పీజీలో 88 కలిపి 699 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు దశాబ్దాలలో ఎన్నో సదుపాయాలు ఒనగూరాయి. నర్సీపట్నంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు దీటుగా నిలబడి గత ఏడాది 88 శాతం ప్రవేశాలతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థులు 75 శాతం ఉత్తీర్ణ సాధించారు. ఇటీవల అన్ని తరగతి గదులకు పబ్లిక్ ఆడియో సిస్టం, సీసీ కెమేరాలు అమర్చారు. కళాశాలలో ఆధునిక విద్యా బోధనకు ఎనిమిది ఎల్‌సీడీ ప్రొజెక్టర్లు, వర్చువల్ తరగతి గదులు, మూడు స్మార్ట్ తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేకంగా 30 కంప్యూటర్లతో జేకేసీ ల్యాబ్ సదుపాయం ఉంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ ప్రయోగశాలలు ఉన్నాయి. వివిధ జాతులకు చెందిన 75 మొక్కలతో బొటానికల్ గార్డెన్ ఉంది. డిగ్రీ, పీజీ విద్యార్థులకు అవసరానికి సరిపడా 16 తరగతి గదులు ఉన్నాయి. రెండు ఎన్ఎస్ఎస్ విభాగాలు నడుస్తున్నాయి. ఇక్కడ గ్రంథాలయంలో 15 వేలకి పైగా పుస్తకాలు, మూడు కంప్యూటర్లు ఉన్నాయి. విద్యార్థులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పుస్తకాల వివరాలు తెలుస్తాయి.



విద్యార్థుల కోసం కంప్యూటర్ ల్యాబ్



అందుబాటులో ఉన్న డిగ్రీ, పీజీ కోర్సులు ఇవీ..

డిగ్రీలో ఏడు సింగిల్ మేజర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బీఏ పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఉన్నాయి. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఎంఎస్సీ అర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు ఉన్నాయి.

అదనపు మౌలిక సదుపాయాలు..

కళాశాలలో విశాలమైన క్రీడా మైదానం ఉంది. బాలికలు, బాలురుకు వేర్వేరుగా వ్యాయామ శాలలు ఉన్నాయి. విద్యార్థులు కోసం క్యాంపస్ ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇక్కడే భోజనం చేస్తున్నారు. తాగునీటికి మూడు ఆర్వో యూనిట్లు ఉన్నాయి. నర్సీపట్నం డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు ఉంది.

కళాశాల ఆవరణలో స్కిల్ హబ్

ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థకు సంబంధించిన స్కిల్ హబ్ కళాశాల క్యాంపస్ ఆవరణలో ఉంది. తద్వారా డిగ్రీ చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువలకు శిక్షణ ఇచ్చి వివిధ ప్రైవేటు కంపెనీలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

ఘనంగా లింగంపేట నూకాలమ్మ తీర్థ మహోత్సవం

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లింగంపేట నూకాలమ్మ జాతరలో భాగంగా మంగళవారం తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తీర్థానికి పరిసర ప్రాంతాలల్లో ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ తీర్థానికి నర్సీపట్నం, నాతవరం, కొయ్యూరు, గొలుగొండ, మాకవరపాలెం తదితర మండలాలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా వందలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తీర్థంలో బొమ్మలు, స్టీల్ సామగ్రి, ఆహ్లాదపరిచే సర్కస్, జాయింట్‌వెల్, తదితర ఆటల యాంత్రాలను కూడా ఏర్పాటు చేశారు. తీర్థంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఎస్ఐ వై.తారకేశ్వరరావు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, గ్రామపెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.





తీర్థానికి తరలివచ్చిన అశేష భక్తజనం... హోరాహోరీగా సాగుతున్న ఎడ్లబండ్ల పరుగు పోటీలు

హోరాహోరీగా ఎడ్లబండ్ల పరుగు పోటీలు

నూకాలమ్మ తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో విజయనగరం, అల్లూరి, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ఎడ్లబండ్ల యజమానులు పాల్గొన్నారు. 1,500 మీటర్ల పరుగు పందెంలో లెక్కవానిపాలెం గ్రామానికి చెందిన పెదపైడితల్లిమ్మతల్లి బండి విజేతగా నిలిచింది. అర్జునగిరి గ్రామానికి చెందిన పరవాడనాయుడు, కేఎల్‌బీ పట్నం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, దండిసూరవరం గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌నాయుడు బండ్లు తర్వాత స్థానాల్లో నిలిచాయి. టీడీపీ నాయకులు పి.అప్పలనాయుడు, గెడ్డం సత్యనారాయణ, ఎం.రమణ పాల్గొన్నారు.

రోలార్ స్కేటింగ్‌లో చైత్ర దీపికకు పతకాలు



చైత్ర దీపికను అభినందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రోలార్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటేషన్స్‌లో పి.చైత్రదీపిక భారతదేశం తరుపున పాల్గొని మూడు పతకాలు సాధించింది. గత నెల 24 నుంచి 30వ తేదీ వరకు తైవాన్‌లో జరిగిన ఆర్టిస్టిక్ రోలార్ స్కేటింగ్ పోటీలలో పెయిర్ విభాగంలో నర్సీపట్నం ప్రాంతానికి చెందిన చైత్రదీపిక బంగారు పతకం, ఇన్‌లైన్ విభాగంలో కాంస్యం, కపుల్ డాన్స్ విభాగంలో రజిత పతకం సాధించింది. ఈ నేపథ్యంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మంగళవారం ఆమెను అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని ఈ సందర్భంగా అయ్యన్న పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నర్సీపట్నంలో స్కేటింగ్ రింక్ నిర్మాణం చేశామన్నారు. ఇటువంటి క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పారిశ్రామిక వేత్తలు సీఎస్ఆర్ నిధులతో మైదానాలు అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు.

4న బీసీ రుణాలకు ఎంపికలు

కె.కోటపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల నాల్గో తేదీన నిరుద్యోగులకు బీసీ సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. గతంలో రుణాలకు దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.

మునిసిపాలిటీలో చలి వేంద్రాల ఏర్పాటు

నర్సీపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పలు ప్రాంతాలలో పాదచారుల వేసవి దాహార్తిని తీర్చడానికి మెప్మా పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అబీద్ సెంటర్‌లోని చలివేంద్రాన్ని చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కమిషనర్ సురేంద్ర, కౌన్సిలర్లు పాదచారులకు తాగునీరు పంపిణీ చేశారు. ప్రాంతీయ ఆస్పత్రి, ఎల్‌ఐసీ బిల్డింగ్, బలిఘట్టం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం వద్ద చలివేంద్రాలు ప్రారంభించారు.

నేడు స్వయం ఉపాధి రుణాల కోసం ఇంటర్వ్యూలు

నర్సీపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని బీసీ, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈ-బీసీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు, రాయితీల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న 380 లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కమిషనర్ సురేంద్ర తెలిపారు. బుధవారం 10 గంటలు నుంచి మునిసిపల్ ఆఫీసులో ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ, ఆదాయ పత్రాల జెరాక్స్‌ను మూడు సెట్లు పట్టుకొని ఇంటర్వ్యూకి హాజరు కావాలని కోరారు. వాహనాలు కోసం దరఖాస్తు చేసుకున్నవారు అన్ని ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కూడా పట్టుకొని రావాలని ఆయన తెలిపారు.

తైక్వాండో విజేతలకు గంటా అభినందనలు



విజేతలతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

చోడవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో విజేతలను భీమిలిఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. గత నెలాఖరున జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన కొల్లిపార తన్విత్ రెండు బంగారు, రెండు రజత పతకాలు, గండి కారుణ్య సందీప్ బంగారు, రజత, రెండు కాంస్య పతకాలు సాధించారు. విజేతలు ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ ఆధ్వర్యంలో గంటాను కలిశారు. విజేతలను అభినందించిన ఎమ్మెల్యే గంటా మరిన్ని పోటీల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ సహస్ర అకాడమీ ఫౌండర్ కె. ప్రదీప్‌కుమార్, కోచ్ గండి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

యువత ఉపాధి కల్పనకు మంత్రి లోకేశ్ హామీ

▸▸ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న రాజు

చోడవ రం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు నియోజకవర్గంలో యువత ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులుగా ఉండిపోతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రభుత్వం తరపున స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇప్పించి అవసరమైన ఉపాధి కల్పనకు మంత్రి సుముఖత వ్యక్తం చేశారన్నారు. త్వరలోనే చోడవరంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నామని, దీనికి అవసరమైన సహకారం అందించాలని మంత్రిని కోరామని పీవీఎస్ఎన్ రాజు వివరించారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజనుల నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి శివారు కొక్కిలబంద, జారురాయి, కొత్తవలస గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం గిరిజనులు అడ్డాకులు టోపీ కట్టుకొని మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. గిరిజన సంఘం జిల్లా ఉపా ధ్యక్షుడు బీటీ.దొర ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. పాతబోయిన బుచ్చన్న, పాలి పెద్ద గంగులు పాల్గొన్నారు.

గంజాయిని అరికట్టేందుకు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

చీడికాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గంజా యి రవాణాను అరికట్టేందుకు డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్నామని కోనాం చెక్‌పోస్టు హెడ్ కానిస్టేబుళ్లు బి.ఈశ్వర రావు, గోవింద, పేరు బాబు అన్నారు. విశాఖ నుంచి వచ్చిన డాగ్‌తో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు వాహనాలను తనిఖీ చేయించామన్నారు. ఈ డాగ్ ద్వారా సునాయాసంగా నిందితులను పట్టుకునేందుకు అవకాశం ఉంటుందని వారు తెలిపారు.

కూలీలందరికి ఉపాధి పనులు

చీడికాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేతనదారులందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని చెట్టుపల్లి సర్పంచ్ గొర్లె గణేష్ అన్నారు. రూ.పది లక్షలతో చేపడుతున్న మాస్టారు చెరువు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు.

గ్రామాల అభివృద్ధే టీడీపీ లక్ష్యం : ఎమ్మెల్యే బండారు

మాడుగుల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే టీడీపీ లక్ష్యమని మాడుగుల శాసనసభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మాడుగులలోవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో రూ.65లక్షలతో నిర్మించిన రక్షిత నీటి పథకాన్ని, ఇండియన్ బ్యాంక్ వద్ద మంచినీరు కొళాయిని ఆయన ప్రారంభించారు. అనంతరం తుడుంవీధి సీసీ రోడ్డు పనులకు భూమి పూజలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామాన తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్‌లో..

మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. సాగరం పంచాయతీ వాడపాడు గ్రామంలో గోకులం షెడ్‌ని, ఎం.కృష్ణాపురంలో సీసీరోడ్డు ప్రారంభించారు. కింతలిలో సీసీ రోడ్, జేఎంజే వాటర్ ట్యాంకు, సత్యవరంలో సీసీ రోడ్డు, జేఎంజే వాటర్ ట్యాంకుని ప్రారంభించారు. కింతలిలో పంచాయతీ బిల్డింగ్‌కి కుంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, సన్యాసిరావు, రమేశ్, జగన్నాథరావు, రమణ పాల్గొన్నారు.



రక్షిత నీటి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

పంట కాలువలు అభివృద్ధి చేయాలి

▸▸ డ్వామా పీడీ పూర్ణిమదేవి

కె.కోటపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పంట కాలువలను అభివృద్ధి చేయడానికి ప్రాధాన్యత కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆర్. పూర్ణిమదేవి అన్నారు. మంగళవారం మండలంలోని వారాడ పంచాయతీలో పంట కాలువల అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ ఉపాధి కూలీలు వంద రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోజుకు కనీసం వేతనం రూ.307 వచ్చేటట్టు పనిచేయాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు మంచినీరు, పందిరి వంటి ఏర్పాట్లు చేయాలని ఏపీవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, ఏపీవో అప్పలరాజు, సిబ్బంది కుమార్ పాల్గొన్నారు.



పంట కాలువల పనులను ప్రారంభిస్తున్న పీడీ ఆర్. పూర్ణిమదేవి

'చిన్నారులకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'



చినపాచిలలో పిల్లల నుంచి సమాధానాలు రాబడుతున్న సీడీపీవో పుష్పదేవి

రావికమతం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను వడదెబ్బకు గురికాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రావికమతం ఐసీడీఎస్ సీడీపీవో పుష్పదేవి అన్నారు. మండలంలోని కవ్వగుంట, కేబీపీ అగ్రహారం,బుడ్డిబంద, కొమిర, మత్స్యపురం, చినపాచిల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సోమవారం తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయా కేంద్రాలలో రిజిస్టర్లు, స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన చిన్నారులను వెలకమ్ చార్టులో బొమ్మలను గుర్తించి, వాటి పేర్లు తెలపాలని సీడీపీవో పిల్లలను అడిగ్గా చిన్నారులు చకచకా సమాధానాలు చెప్పడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. పిల్లలకు అందించే పౌషికాహారంపై ఆరా తీశారు. వడదెబ్బకు గురికాకుండా అంగన్‌వాడీల్లో పిల్లలకు పౌష్టికాహారంతోపాటు తరచూ తాగునీటి ఇవ్వాలని సూచించారు.

కాటపల్లికి అంబేడ్కర్ సేవారత్న అవార్డు, అభినందనలు

దేవరాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లికి చెందిన దళిత ఉద్యమ నాయకుడు కాటపల్లి అప్పారావుకు రాష్ట్ర స్థాయి అంబేడ్కర్ సేవారత్న అవార్డు అందుకున్నారు. అప్పారావు 30 ఏళ్లగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డును అందజేశారు. ఒంగోలులోని తూర్పు నాయుడుపేటలో జరిగిన కార్యక్రమంలో అప్పారావుకు అవార్డును రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు అందజేశారు.

పశువుల నీటితొట్టెల పనులు ప్రారంభం

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో కందిపూడి, వడ్డాది సంతబయలు గ్రామాల్లో పశువుల నీటి తొట్టె పనులకు ఎంపీడీవో భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో టౌన్ అధ్యక్షుడు దొండా నరేష్, పంచాయతీ ఈవో లోవరాజు, ఏపీవో ఎస్.వరహాలుబాబు, వీఆర్వీ గోవింద, దొండా నారాయణమూర్తి, తలారి శంకర్, కోరుకొండ కామరాజు పాల్గొన్నారు.

వారపు సంత, షాపుల వేలం పాట వాయిదా

చీడికాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాంలో వారపు సంత, నాలుగు షాపులకు జరిగే వేలం పాటను వాయిదా వేస్తున్నామని ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ పట్నాల గోపి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు వేలం పాట జరుగుతుందని ముందుగా ప్రకటించామన్నారు. . అయితే గ్రామ సర్పంచ్ లేకపోవడంతో వేలంపాట ఈనెల 4వ తేదీ ఉదయం 10గంటలకు నిర్వహించేందుకు వాయిదా వేశామని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ఎ.సన్యాసిరావు, మాజీ సర్పంచ్ చలుగు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

మాడుగుల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయసులోనే ఆర్మీ ఉద్యోగంలో చేరి పదవీవిరమణ చేసి మంగళవారం గ్రామానికి వచ్చిన ఓబులరెడ్డి ఈశ్వర్ ప్రసాద్‌కు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. చీడికాడ మండలం కొత్త లింగభూపాలపట్నం గ్రామానికి చెందిన రామ్‌నాయుడు, రమణమ్మ దంపతుల కుమారుడు ఈశ్వర్ ప్రసాద్ 19వ సంవత్సరంలో ఆర్మీలో చేరాడు. మార్చి 31న పదవీ విరమణ పొందిన ఆయన మాడుగులలో దేవాలయాలను దర్శించుకొని, గ్రామానికి వెళ్లేందుకు వచ్చాడు. కొత్త లింగభూపాలపట్నం గ్రామానికి చెందిన ప్రజలు, బంధువులు మాడుగులలో జాతీయ జెండాలతో ఘన స్వాగతం పలికారు.

గాంధీగ్రామంలో ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీ



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీ గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు పేదలకు అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో అంజనేయులు, స్థానిక నాయకులు డీకే శ్రీను, అద్దూరు గోపి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రుణాలకు ఇంటర్వ్యూలు

చోడవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న మండలంలోని లబ్ధిదారులకు ఈనెల 3,4 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎండీవో పీవీఎస్‌జే ఆంజనేయులు మంగళవారం తెలిపారు. రుణాల కోసం దరఖాస్తు చేసిన 1,132 మందిలో అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు.

పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీలకు ఉచిత కోచింగ్

దేవరాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీలకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్టు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కేవీ.రమణ, కె.శ్రీను తెలిపారు. ఈనెల 4 నుంచి స్థానిక ఉషోదయ కాన్సెప్ట్ స్కూల్‌లో కోచింగ్ ఇస్తారన్నారు. పొందవలసినవారు 9985250072, 9703556257లను సంప్రదించాలన్నారు.

నేడు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాజు సమీక్ష

రోలుగుంట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమీక్షకు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

మరిడిమాంబ గ్రామ దేవతకు పూజలు



గ్రామదేవతను దర్శించుకుంటున్న బూడి

దేవరాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేపల్లి మరిడిమాంబ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు. మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు,అవుగడ్డ అప్పలనాయుడు, బండారు రామకృష్ణ పాల్గొన్నారు.

కుసర్లపూడి పాల సంఘం అధ్యక్షుడిగా కాశీ

రోలుగుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుసర్లపూడి పాల సంఘం నూతన అధ్యక్షుడిగా సబ్బవరపు కాశీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుత పాల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు పెద్దినాయుడు ఇటీవల గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఆయన కుమారుడైన కాశీని డైరెక్టర్లుంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డైయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు అభినందించారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో దిబ్బిడి, వడ్డాది, జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు మార్చి17న ప్రారంభమై ఏప్రిల్ 1న ముగిశాయి. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష కేంద్రాల నుంచి ఇంటికి వెళ్లారు.

కొనసాగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

» కొయ్యూరులో 38 డిగ్రీలు

పాడేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మన్యంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో ఎండలకు జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో మంగళవారం కొయ్యూరులో 38.0 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, డుంబ్రిగుడలో 38.2, పాడేరు, జి.మాడుగులలో 35.7, ముంచంగిపుట్టు, పెదబయలులో 35.4, అరకులోయలో 35.1, హుకుంపేటలో 33.8, చింతపల్లి, జీకేవీధిలో 33.6, అనంతగిరిలో 32.5. డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'ఎలక్ట్రీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి'

జి.మాడుగుల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని ఎలక్ట్రికల్ యూనియన్ మండల అధ్యక్షుడు వాసు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం వారు నెల వారీ సంఘ సమావేశం నిర్వహించారు. వేసవి కాలం కావడంతో గృహ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉంటూ పనులు పూర్తి చేయాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు గృహ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విన్నవించారు. యూనియన్ పరంగా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నట్టు సభ్యులకు స్పష్టం చేశా రు. ఈ కార్యక్రమంలోయూనియన్ సభ్యులు సాయి, శ్రీను, జగదీశ్, చందు, ప్రసాద్, దేవరాజు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

అనంతగిరి: మండల కేంద్రంలోని కొత్తవలస పాఠశాలలోని పదో గరతి పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ వీ మాణిక్యం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ఉన్నతాధికారులు పర్యవేక్షణలోని సీసీ కెమెరాల నడుమ పరీక్షలు కొనసాగడంపై సంతృప్తివ్యక్తం చేశారు.

హుకుంపేట; పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు స్థానిక ఎంఈఓలు ఈశ్వరరావు, చెల్లయ్యలు తెలిపారు. చివరి రోజు మంగళవారం మండలంలోని బాకురు, హుకుంపేట కేం ద్రాల్లో జరిగిన సోషల్ పరీక్షకు 655 మంది గాను 650 మంది పరీక్ష రాశారన్నారు. ఐదుగురు గైర్హాజరయ్యారన్నారు. ఈ పరీక్షల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా విద్యాశాఖ సిబ్బంది , పోలీసులు సహకరించారన్నారు.

అక్రమ కట్టడాలను నిలుపు చేయాలని ఆందోళన



వినతి ప త్రమిస్తున్న కించుమండ గ్రామస్థులు

డుంబ్రిగుడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కించుమండ పంచాయతీ కేంద్రంలో గిరిజనేతరులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలను నిలుపు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు సచివాలయం వరకు ర్యాలీగా వెళ్లి నినాదాలు చేశారు. అనంతరం డుంబ్రిగుడలోని తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి ఆర్ఐ కోటేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరులు ప్రభుత్వ స్థలల్లో అక్రమ కట్టడాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో రామనాయుడు, చిరంజీవి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కాఫీ, సిల్వర్ ఓక్ తోట దగ్ధం

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంచుల పంచాయతీ చామగెడ్డలో ఎకరా కాఫీ, సిల్వర్ ఓక్ తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన చెదల శశికాంత్ ఆరేళ్ల క్రితం సిల్వర్ ఓక్ మొక్కలు నాటారు. రెండేళ్ల క్రితం అంతర్ పంటగా కాఫీ మొక్కలు వేశారు. ఈ తోటకు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం మంట పెట్టారు. ఇవి వ్యాపించి సిల్వర్ఓక్, కాఫీ తోట కాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతువిజ్ఞప్తి చేస్తున్నాడు.

విడిది గృహాల ఏర్పాటుతో ఉపాధి

» పీటీజీ గిరిజనులతో కలెక్టర్ దినేశ్ కుమార్

» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



కోసంగి గ్రామంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

డుంబ్రిగుడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా విడిది గృహాలను తీర్చిదిద్ది ఉపాధి పొందాలని జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ పీటీజీ గిరిజనులకు సూచించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ నెల 7వతేదీన పర్యటించనున్న నేపథ్యంలో మండలంలోని పోతంగి పంచాయతీ పెదపాడు, కోసంగి గ్రామాల్లో మంగళవారం ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద నిర్వహించనున్న బహిరంగ సభా స్థలాన్ని ఆయన పరిశీలించారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వాలీబాల్ మైదాన ం ప్రాంగణంలో వాహనాల నిలుపుదలకు ఎంపిక చేశారు. ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఎస్పీ అమిత్‌బర్దర్ ఈ కార్యక్రమంలో ఉన్నారు. పెదపాడులో జన్‌మన్ గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడారు. గృహాలను త్వరగతిన నిర్మించుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు. పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారీకి ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో ఇళ్ల నిర్మాణం పూర్తయితే, పాత గృహాలకు సొబగులు కల్పిస్తే.. స్థానికంగా ఉపాధి పొందేందుకు వీలవుతుందని గిరిజనులకు సూచించారు. కోసంగిలో రక్షిత తాగునీటి పథకం లేక గెడ్డ నీటితో అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఈ సందర్భంగా విన్నవించారు. స్పందించి కలెక్టర్ తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్ము పెంపుతో భరోసా

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



నందకోటలో పింఛన్ అందిస్తున్న శ్రావణ్‌కుమార్

అనంతగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల నగదు పెంపొందించి కుటుంబాలకు భరోసా కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని భింపోల్ పంచాయతీలోని సరియాపల్లి, భీంపోల్, నందకోట, గొంద్రింగిపాడు గ్రామాల్లో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. పింఛన్ లబ్ధిదారుల సమస్యలపై అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో పింఛన్ల సొమ్ము పెంచి సీఎం చంద్రబాబు హామీ నిలుపుకున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ క్షేమంగా ఉండాలనే లక్ష్యంతో ఆహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. మం త్రి లోకేశ్ ప్రణాళికాయుతంగా గిరిజన ప్రాంతాలను అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి. ఆనందరావు, సర్పంచ్ భీమ్మలమ్మ, కె. అప్పారావు, జోగులు, నిర్మల, లక్ష్మణ్‌రావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అరకును వాల్తేర్ డివిజన్‌లోనే ఉంచాలి

» కేంద్ర రైల్వేశాఖా మంత్రికి ఎంపీ విజ్ఞప్తి



కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ తనూజారాణి

అనంతగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): అరకును వాల్తేర్ రైల్వే డివిజన్‌లోనే కొనసాగించాలని కేంద్ర రైల్వేశాఖా మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి కోరారు. మంగళవారం న్యూఢిల్లీలోని కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై విన్నవించారు. ఆ వివరాలను స్థానిక విలేకరులకు ఆమెతెలిపారు. వాల్తేర్ డివిజన్‌లో ఉన్న అరకును ఒడిశాలోని రాయగడ డివిజన్‌కు మార్చడంతో ఉత్తర ప్రాంతంలో ఉన్న గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని, దీనిపై మరోసారి పునరాలోచించాలని ఆమె మంత్రిని కోరారు. అలాగే అరకు రైల్వే రిక్వెస్ట్ సమస్య పరిష్కరించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

వాయిదా పడిన పెసా ఎన్నికలను నిర్వహించండి

డుంబ్రిగుడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలో వాయిదా పడిన పెసా కమిటీలను నిర్వహించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు బోసు డిమాండ్ చేశారు. ప్రభుత్వాల ఆదేశాలతో గత నెలల్లో గిరిజన ప్రాంతాల్లో ఎన్నికలను నిర్వహించారు. అనివార్య కారణాలతో కొన్నిచోట్ల నిలిచిన ఎన్నికలను అధికారులు పూర్తి చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా రామాలయ ప్రారంభోత్సవం



వలసగెడ్డ అటవీప్రాంతంలో నిర్మించిన రామాలయం



గణపతి పూజ నిర్వహిస్తున్న పండితులు

సీలేరు, ఏప్రిల్ 1 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం, దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ అటవీప్రాంతంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవాలు మంగళవారం అం గరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. తొలిరోజు ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, అఖండ దీపారాధన, పుణ్యహవచనం, అగ్ని ప్రతిష్ఠాపన, మంత్ర పుష్పం తదితర పూజా కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. అనంతరం సాయంత్రం సీతారాముల విగ్రహాలను సీలేరు పురవీధుల్లో ఊరేగించారు. గురువారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి రిటైర్డ్ ముక్తేశ్వరరావు 20 ఏళ్ల కిందట వలసగెడ్డ అటవీప్రాంతంలో రామాలయంను తాత్కాలికంగా రే కులషెడ్డులో నిర్మించారు. అది శిథిలావస్థకు చేరుకోవడంతో ఆయన మళ్లీ సొంత ఖర్చులతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టారు. గురువారం జరిగే సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్టు ఆలయ కమిటీ ఈ సందర్భంగా తెలిపింది.

వేసవిలో చిన్నారుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న చిన్నపిల్లల వైద్యురాలు ప్రభావతి

చింతపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో శిశువులు, చిన్నారుల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జి. ప్రభావతి అన్నారు. మంగళవారం స్థానిక నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో తల్లులకు శిశువుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మా ట్లాడుతూ వేసవిలో శిశువులు, చిన్నారుల శరీరంలో ఉష్ణతాపం ఉంటుందన్నారు. చిన్నారులను బయటకు తీసుకొని వెళ్లే సమయంలో ఎండ తీవ్రత పడకుండగా గొడుగులను ఉపయోగించాలన్నారు. పిల్లలను ఎండలో ఆడుకునేందుకు పంపించరాదన్నారు. కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, బార్లీ అధికంగా ఇవ్వాలన్నారు. ఈకాలంలో చిన్నారుల్లో నీరసం, వాంతులు, విరోచనాలు సమస్యలతో అస్వస్థతకు గురైతే వెంటనే ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించాలన్నారు. గిరిజనులు పసర మందులు పట్టరాదన్నారు.

కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ

చింతపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లు మంగళవారం పంపిణీ చేసినట్టు ఎంపీడీవో యూఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో ఇటీవలభర్త చనిపోయిన కిల్లో జానకమ్మ, చిన్నగెడ్డ గ్రామంలో జక్కా పార్వతమ్మలకు ఈ పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయన్నారు. వీరికి మూడు నెలల పింఛన్ మొత్తం రూ.12వేల చొప్పున అంజేశామన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి, కూటమి నాయకులు రీమల ఆనందరావు, దూరిరామకృష్ణ, మంగు, అప్పారావు, జనసేన నాయకుడు పండు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు తాగునీటి తొట్టెలు

చింతపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో తొలివిడతగా 12 పశువుల నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో యూఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం చింతపల్లి, అంతర్ల గ్రామాల్లోనీటి తొట్టెలు నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి పథకం నిధులతో నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. తొలివిడతగా 12 పశువుల నీటి తొట్టెలు మంజూరయ్యాయన్నారు. ఈకార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ పి.చంద్రశేఖర్, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు ధారలక్ష్మి, కూటమి నాయకులు రీమల ఆనంద్‌రావు, దూరి రామకృష్ణ, జనసేన నాయకుడు పండు, పశువైద్యాధికారులు చల్లంగి చాలిని, దేశగిరి దమయంతి, ఏపీవో రాజు పాల్గొన్నారు.

కొయ్యూరు: వేసవిలో మూగ జీవాలు తాగునీటి ఎద్దడి ఎదుర్కోకుండా ఉండాలనే సదుద్దేశంతో ప్రభుత్వం నీటితొట్టెల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు సూచించారు. మంగళవారం కొయ్యూరులో నీటితొట్టి నిర్మాణాలకు కూటమి నేతలు భూమిపూజలు నిర్వహించారు. చింతలపూడిలో ఏపీవో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మేడిబోయిన సత్తిబా బు, చక్రరావు, జి.శ్రీను, ఎన్. సత్యనారాయణ, వి. సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి నాయుడు, వీఆర్పీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మినీ గోకులాలు మంజూరు

మండలంలోని 33 పంచాయతీలలో 99 పశువుల షెడ్లు (మినీ గోకులాలు) నిర్మాణానికి గానూ ప్రతిపాదనలు పం పించగా తొలివిడతగా తొమ్మిదింటికి అనుమతులు వచ్చినట్టు, మిగిలిన వాటిని ఈ నెలాఖరులోగా మంజూరయ్యే అవకాశాలున్నట్టు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చింతపల్లి క్లస్టర్ ఏపీడీ లాలం సీతయ్య తెలిపారు. మంగళవారం మండలంలో గడబపాలెం పశువుల నీటితొట్టి నిర్మాణాలను ఏపీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో పశువుల తాగునీటి అవసరాలకు తీర్చేందుకు రూ 7.26 లక్షలతో 22 నీటితొట్టెల నిర్మాణాలు చేపడుతున్నట్టు చెప్పారు. ఏపీవో అప్పలరాజు, ఏపీడీ వెంట పథకం ఇంజనీరింగ్ అసిస్టెంట్ టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



కొయ్యూరులో భూమి పూజ నిర్వహిస్తున్న కూటమి నేతలు



చింతపల్లి: చింతలపూడిలో నీటితొట్టెలకు భూమిపూజ ఉపాధి ఏపీవో

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయితీలోని లకేపుట్టు గ్రామంలో మంగళవారం నీటి తొట్టెల నిర్మాణానికి ఎంపీడీవో పూర్ణయ్య శంకుస్థాపన చేశారు.మండలంలో వన్నాడా, బొంగరం, గసాబు, లకేపుట్టు, గంపరాయి, పెదకోడపల్లి, ఇంజరీ, జామిగూడ గ్రామాలలో ఈ నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. ఏపీవో పెదప్పలనాయుడు, పశువైద్య శాఖ సిబ్బంది వరలక్ష్మి, స్థానిక సర్పంచ్ కొర్ర నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: రైతులు విధిగా మూగ జీవాలకు దాహం తీర్చేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీపీ ఎ.సీతమ్మ అన్నారు. సుజనకోట పంచాయతీ సర్సిపుట్టు గ్రామంలో రూ. 30 వేలతో నిర్మించిన నీటి తొట్టెను మంగళవారం ఆమె ప్రారంభించారు. సర్పంచి వి.రమేశ్, ఏపీఓ సంఘంనాయుడు, వైసీపీ నేత జయదేవ్, తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టు: తాగునీటి తొట్టెను ప్రారంభిస్తున్న ఎంపీపీ సీతమ్మ

ముగిసిన టెన్త్ పరీక్షలు

సోషల్ పరీక్షకు 99.20 శాతం మంది హాజరు

పాడేరురూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 22 మండలాల్లో 71 పరీక్ష కేం ద్రాల్లో మార్చి 17 వతేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్ర శాంతంగా ముగిసినట్టు డీఈవో పి.బ్రహ్మాజీరావు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ (ప్రభుత్వ పరీక్షలు) శశికుమార్ తెలిపారు. 1వతేదీ మంగళవారం చివరి రోజు జరిగిన సోషల్ పరీక్షలకు 99.20 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని వారు తెలిపారు. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 11,570 మందిలో 11,478 (99.20) శాతం మంది హాజరయ్యారన్నారు. మిగిలిన 92 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు చెప్పారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు ఐదుగురిలో ఇద్దరు గైర్హాజరైనట్టు పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు కోచింగ్

పాడేరురూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 2వ తేదీ బుధవారం నుంచి ఉచితంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం శిక్షణను అం దించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిపుణులైన అధ్యాపకులతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు మెటీరియల్‌ను ఉచితంగా అందించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు ఫోన్: 94904 91157, 8309 393981, 738219 1203ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చింతపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత బస్ స్టాండ్ వద్ద యువకులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా గౌతమ్, జస్వంత్ మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చే గిరిజనులు దాహార్తిని తీర్చుకునేందుకు తమ తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన మన్యం నేతలు



మంత్రి లోకేశ్‌తో జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, ఏప్రిల్ 1 (ఆం ధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మాన వవనరుల శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మన్యం నేతలు సోమవారం విశాఖపట్నంలో మర్యాపూర్వకంగా కలిశారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టూరిజం డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకట రమేశ్‌నాయుడు, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడా వెంకట సురేశ్‌కుమార్, తదితరులు నారా లోకేశ్‌ను కలిసి పలు విషయాలను ప్రస్తావించారు.

పెదలబుడు అభివృద్ధికి సహకరించండి

» మంత్రి లోకేశ్‌కు సర్పంచ్ దాసుబాబు వినతి

అరకులోయ, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): అరకులోయ మండలం పెదలబుడు గ్రామ పంచాయతీని గతంలో ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు దత్తత తీసుకొని అభివృద్ధి చేశారని, అయితే, ఎన్నికలు సమీపించడంతో అప్పట్లో కొన్ని గ్రామాల్లో పనులు నిలిచిపోయాయని, ఈ స్థితిలో వీటికి నిధులు మంజూరు చేయాలని ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కోరినట్టు పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు తెలిపారు. లోకేశ్ విశాఖపర్యటనకు వచ్చిన నేపథ్యంలో సోమవారం రాత్రి ఆయనను కలిసి ఈ మేరకు నివేదిక అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసుబాబు విలేకరులకు ఆ వివరాలను తెలిపారు. పంచాయతీలో మంజూరైన పనులను వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిపేసిందన్నారు.ఐదు గ్రామాల్లో రీ సర్వే జరిపి మూడు గ్రామాలకు పట్టాలు పం పిణీ చేశారని, మిగిలిన రెండు గ్రామా పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని లోకేశ్‌ను కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, పద్మాపురం మాజీ సర్పంచ్ లకోయ్‌మహదేవ్, వెంకటరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసుల పునరుద్ధరణకు కృషి

» విజయనగరం జోనల్ చైర్మన్ దొన్నుదొర



మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర

జి.మాడుగుల, ఏప్రిల్ 1 : మండలంలోని మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసుల పునరుద్ధరణకు కృషి చేయనున్నట్టు విజయనగం ఆర్టీసీ జోనల్ చైర్మన్ సివేరి దొన్నుదొర చెప్పారు. మంగళవారం ఆయన జి.మాడుగుల వచ్చారు. ఇటీవల నూతనంగా ఎంపీపీగా ఎన్నికైన ఎల్.అప్పలరాజుకు అభినందించారు. మండలం కేంద్రం మీదుగా గడుతూరు, వంతాల, జి.మాడుగుల నుంచి విశాఖ నైట్‌హాల్ట్ తదితర ఆర్టీసీ సేవలు పునరుద్ధరించాలని, సంస్థలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని స్థానిక నేతలు కోరారు. వీటిపై దొన్నుదొర సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, అరకు టీడీపీ నాయకులు చెట్టి బాబురావు, పెట్టెలి దాసుబాబు, స్థానిక నాయకులు కృష్ణమూర్తినాయుడు, పి.భీంబాబు, ఎం.రామరావు, బోయిన బాబూరావు, కె.చిన్నకొండబాబు, ఎస్.కొండలరావు, జి.కొండబాబు, పి. రామన్నదొర తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం



కిరాణా షాపు వద్ద ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పాడేరురూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాడేరు పంచాయతీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్టు ఈవోపీఆర్ అండ్ ఆర్డీ ఆర్‌వీఎస్ రమేశ్ తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే నష్టాలపై గత 15 రోజులుగా పంచాయతీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగం, అమ్మకాలు చేపట్టవద్దని వ్యాపారులకు సూచించామన్నారు. ఈ నేపథ్యంలో 1వ తేదీనుంచి పట్టణంలో వివిధ షాపులను ఆకస్మికంగాతనిఖీలు చేపడుతున్నట్టు చెప్పారు. బుధవారం ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న కొంతమంది షాపు యజమానులను గుర్తించి జరిమానాలు విధించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు మర్రిచెట్టు రామునాయుడు,గ్రామస్తులు కూడా భాస్కరరావు, జె.వెంకటలక్ష్మి, జి.రవికుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ



ముంచంగిపుట్టు: కిలగాడ పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

చింతపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న సీహెచ్‌డబ్ల్యూలు ఆశ కార్యకర్తలుగా ప్రభుత్వం గుర్తించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం తాజంగి పీహెచ్‌సీలో సీహెచ్‌డబ్ల్యూలు ఆందోళన చేశారు. ఈసందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఆశ కార్యకర్తలతో సమానంగా సీహెచ్‌డబ్ల్యూవోలు పనిచేస్తున్నా వేతనాల్లో వ్యత్యాసం ఉందన్నారు. ఆశ, సీహెచ్‌డబ్ల్యూలకు పదవీ విరమణ రాయితీలు, పసూతీ సెలవులు అందజేయాలన్నారు. ఈసమస్యలపై ఈనెల 11న జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామన్నారు.

ముంచంగిపుట్టు: ఆస్పత్రులలో పని చేస్తున్న సీహెచ్ డబ్ల్యూ, ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరరావు అన్నారు. కిలగాడ పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం సీహెచ్‌డబ్ల్యూ, ఆశ వర్కర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజనసంఘం మండల కార్యదర్శి కె.త్రినాథ్, సీహెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు 7వతేదీ వరకు నీటి విడుదల

సీలేరు, ఏప్రిల్ 1 , (ఆంధ్రజ్యోతి) : సీలేరు కాంప్లెక్సు నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు నీటి విడుదలను ఈ నెల 7 వరకు పొడిగించినట్టు ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు డొంకరాయి జలాశయం స్పిల్‌వే ద్వారా విద్యుత్ ఉత్పత్తి లేకుండా.. నేరుగా 5 వేల క్యూసెక్కులు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రంనుంచి 4300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు. డొంకరాయి జలాయం నుంచి ఫిబ్రవరి 10 నుంచి మార్చి 31 వరకు ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయాలని తొలుత కోరారన్నారు. అయితే, రబీ పంటలకు ఇంకా నీటి అవసరం ఉన్న నేపథ్యంలో ఏప్రిల్ 7 వరకు డొంకరాయి నుంచి 5 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నట్టు చెప్పారు. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 31 వరకు డొంకరాయి జలాశయం స్పిల్‌వే గేట్ల ద్వారా 14.468 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు ఆయన వివరించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌లో ఆంధ్రా వాటా 33.1849 టీఎంసీలు, డొంకరాయి, గుంటవాడ (సీలేరు) జలాశయాల్లో 13.1061 టీఎంసీలతో కలసి మెత్తంగా సీలేరు కాంప్లెక్సుకు 46.2910 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు సీఈ వాసుదేవరావు తెలిపారు.



ఉపాధి సిబ్బందితో ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్

వ్యవసాయం, పాడిపై దృష్టిసారించండి

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు పాడి రంగంపై కూడా దృష్టిసారించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. సీహెచ్ఎన్ అగ్రహారంలో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు ఉపాధి పథకం నిధులతో ఏర్పాటు చేయనున్న నీటి తొట్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రంగం రోజు రోజుకూ దిగజారిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వ్యవసాయ, పాడి రంగాలకు పెద్ద పీట వేస్తున్నదని చెప్పారు. పలు పథకాల ద్వారా రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. అనంతరం ఉపాధి సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీడీవో కేవీ నరసింహరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ మణికుమార్, ఏపీవో సుప్రియ, నాయకులు కె.గోవింద్, కె.అచ్చెయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి తొట్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

కశింకోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నూతన గుంటపాలెం పంచాయతీ త్రిపురవానిపాలెం గ్రామంలో పశువుల తాగునీటి తొట్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం శంకుస్థాపన చేశారు. అలాగే గోకులం షెడ్డును ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన తొట్ల నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుభాషిణి, ఎంపీడీవో వీవీ.రవికుమార్, ఏపీవో శ్రీనివాసరావు, కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళీ, జెర్రిపోతుల నూకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీఎస్పీకి సత్కారం



డీఎస్పీ దంపతులను సత్కరించిన జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రింగురోడ్డు జంక్షన్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో రిటైర్డ్ డీఎస్పీ అప్పారావును జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డీఎస్పీ అప్పారావు వివిధ హోదాల్లో పనిచేసి ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. 34 ఏళ్లుగా పోలీసు శాఖకు ఆయన సేవలందించారన్నారు. ఆయన సమర్థత, నిబద్ధత, నైపుణ్యాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, రిటైర్డ్ ఎస్పీ రవివర్మ, నర్సీపట్నం, అనకాపల్లి, పరవాడ డీఎస్పీలు పి.శ్రీనివాసరావు, ఎం.శ్రావణి, విష్ణుస్వరూప్, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాస్, సీఐలు లక్ష్మణమూర్తి, బాలసూర్యారావు, ఏవో రామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

11 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నగదును అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని 11 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.9.85 లక్షలను మంగళవారం పంపిణీ చేశారు. జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ఆధ్వర్యంలో మంగళవారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి కష్టమొచ్చినా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న కల్యాణ పత్రిక ఆవిష్కరణ



కల్యాణ పత్రికను ఆవిష్కరిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం దిబ్బవీధిలోని వరహాలక్ష్మీనృసింహస్వామి కల్యాణ పత్రికను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కల్యాణ మహోత్సవం 8వ తేదీన జరగనుంది. కార్యక్రమంలో ఆలయ కిటీ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు, కొణతాల భాస్కరరావు, బీవీ.నూకరాజు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ శిక్షణను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు సూచించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌర్ణమి సేవా సంస్థ ఆధ్వర్యంలో 16 ఏళ్లుగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం 17వ ఏటా ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని కల్యాని నర్సింగ్ హోం మేడపై 12 మంది నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన చెప్పారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బుద్ద సోమేశ్వరరావు, పెతకంశెట్టి ఆదికోటి, బొడ్డేడ కాశీ, మొల్లి నాగేశ్వరరావు, ఆడారి శివాజీ పాల్గొన్నారు.

లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో...

నరసింగరావుపేట రామచంద్ర థియేటర్ వెనుక లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు బుధవారం నుంచి ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్టు సంస్థ చైర్మన్ కె.సత్యనారాయణ తెలిపారు. అనకాపల్లి పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాని కోరారు.

పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

▸▸ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

పరవాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్ఆర్ కార్యక్రమంలో సమకూర్చిన డస్ట్‌బిన్లులను మంగళవారం వాడచీపురుపల్లిలో దుకాణాల యజమానులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెత్తను ఆరు బయట పడవేయరాదని సూచించార. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే అందరం ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తను బయట వేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో చెత్తను డస్ట్‌బిన్లులో వేసి పారిశుధ్య కార్మికులకు అప్పగించాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కలిగే అనర్థాలను ఆమె వివరించారు.



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, తదితరులు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

వాడచీపురుపల్లి పంచాయతీలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురిని ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రత్యేకాధికారి గిరీశ్‌షా, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి, తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్, ఎంపీడీవో కె.ధర్మారావు, పంచాయతీ కార్యదర్శి జి.అచ్యుతరావు, సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్‌ను ప్రకటించాలి

కొత్తూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పింఛన్‌దారులకు మేలు చేసే విధంగా వెంటనే రాష్ట్రంలో వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ని నియమించాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఫ్యాప్టో చైర్మన్ బోయిన చిన్నారావు, కార్యదర్శి వై.సుధాకరరావు, కోశాధికారి ఎస్.దుర్గాప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా తమకు ఇచ్చిన హామీలను అమలుచేసే దిశగా చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాలకు నిధులు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, ఉద్యోగుల వరకూ వచ్చేసరికి అప్పులు, నిధుల కొరత అంటూ దాటవేసే ధోరణి ప్రదర్శించడం సరికాదన్నారు. తమకు చెల్లించాల్సిన బకాయిలు కూడా పూర్తి స్థాయిలో చెల్లింపులు చేయడం లేదన్నారు. ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. పాత పింఛను విధానాన్నే అమలు చేయాలన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి బుధవారం అన్ని జిల్లా కలెక్టర్ల కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామని వారు చెప్పారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కేఎస్ఎస్ ప్రసాద్, వత్సవాయి లక్ష్మి, ఎం.శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, చల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.



జిల్లా సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న ఫ్యాప్టో ప్రతినిధులు

సంక్షేమ బోర్డు పునరుద్ధరించకపోతే సమ్మె

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ

కొత్తూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే మే 20న సమ్మె చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ హెచ్చరించారు. అనకాపల్లి మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌ల నిధులు మంజూరు చేయాలన్నారు. 55 ఏళ్లు పైబడిన ప్రతీ కార్మికుడికి రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఒకే మాదిరి సంక్షేమ బోర్డును అమలు చేయడంతో పాటు ఈఎస్ఐ (వైద్యం) సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు సిహెచ్.రాజు, ఎం.సత్యనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

దేవీపురంలో లలితా సహస్ర నామావళి

సబ్బవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలం లోని దేవీపురం గ్రామంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సహస్రనామావళి నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత పారాయణ సహిత కుంకుమార్చన, రష్మీ మాలా సహిత లలితా హోమం, లలిత అమ్మవారికి క్షీరాభిషేకం, సామూహిక కలా వాహన గురు పత్ని నిర్వహించారు. అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో గురుపత్ని చేతులు మీదగా భక్తులు ఉచిత అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్, పలు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.



పూజలు అందుకుంటున్న లలితాంబిక అమ్మవారు

సింహాద్రి కాలుష్యం నుంచి కాపాడండి

కలెక్టర్‌కు సోమినాయుడుపాలెం గ్రామస్థులు వినతి

పరవాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీ నుంచి వెదజల్లుతున్న కాలుష్యం నుంచి తమను కాపాడాలని రావాడ పంచాయతీ పరిధిలోని సోమినాయుడుపాలెం గ్రామస్థులు మంగళవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి వేడుకున్నారు. సింహాద్రి ప్లాంట్‌కు చెందిన చిమ్నీల నుంచి ఉప్పు నీటి తుంపర్లు ఇంటి పైకప్పులపై పడుతున్నాయని దీని కారణంగా ఇంటి తలుపులు, కిటికీలు తుప్పు పడుతున్నాయని వివరించారు. పంటలు సైతం పండటం లేదన్నారు. భూగర్భ జలాలు కలుషితమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని తెలిపారు. గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న నేతృత్వంలో గ్రామస్థులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

క్రషర్స్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

తుమ్మపాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): క్వారీ, క్రషర్స్ కార్మికుల డిమాండ్‌లను యాజమాన్యాలు తక్షణమే నెరవేర్చాలని క్వారీ, క్రషర్స్ కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ కోన మోహనరావు చెప్పారు. బవులవాడలో మంగళవారం కార్మికులతో కలిసి నిర్వహిస్తున్న ఆయన, సమ్మె కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. క్వారీల్లో డ్రిల్లింగ్, కంప్రెసర్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. ప్రమాదాలకు గురైన కార్మికులను యాజమాన్యాలు పూర్తిగా ఆదుకోవాలన్నారు. రూ.25 లక్షల పరిహారాన్ని అందించడంతో పాటు కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అలాగే కార్మికులకు ప్రతి ఏటా బోనస్‌లను చెల్లించాలన్నారు. అనారోగ్యాలకు గురైన కార్మికులను యాజమాన్యాలు ఆదుకోవాలన్నారు. ప్రతి నెల పదో తేదీ నాటికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సేనాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, సేనాపతి సూరిబాబు, ముమ్మిన శ్రీను, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



దర్జీనగర్‌లో సమ్మె చేస్తున్న క్వారీ, క్రషర్స్ కార్మికులు

కోట్నివీధి సీతారామాలయ ప్రతినిధిగా రామకృష్ణ



రామకృష్ణను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలోని కోట్నివీధిలో శ్రీసీతారామాలయ కమిటీ ముఖ్య ప్రతినిధిగా కోట్ని రామకృష్ణ ఎన్నికయ్యారు. మంగళవారం కోట్నివీధి రామాలయ కళ్యాణ మండపంలోని గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ ముఖ్య ప్రతినిధిగా కోట్ని రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గ్రామస్థులు కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని చెప్పారు. ఆలయ అభివృద్ధితో పాటు గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నూకాంబిక ఆలయంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో దివిస్ ల్యాబొరేటరీ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, సీఎస్ఆర్‌డీ సురేశ్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు సూరే సతీష్, దాడి రవికుమార్, మారిశెట్టి శంకరరావు, పొలిమేర ఆనంద్, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీఎం కోటేశ్వరరావు

అగ్నిగుండం తొక్కిన నూకాంబిక భక్తులు



అగ్ని గుండం తొక్కుతున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాకాశివీధి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో భాగంగా మాలధారణ భక్తులు సోమవారం రాత్రి అగ్నిగుండం తొక్కి మొక్కులు తీర్చుకున్నారు. మాలధారణ చేసిన భక్తులు ఇరుముడి ధరించి పురవీధుల మీదుగా ఊరేగిన అనంతరం రాత్రి ఆలయానికి చేరుకుని అగ్నిగుండానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండంలో నడుచుకొని వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాకాశి రాజేశ్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తాకాశి కన్నబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాశి కిశోర్, తాకాశివీధి పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

సబ్బవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం సీతమ్మధారిలోని అటామిక్ మినరల్స్ డిపార్టుమెంట్ కార్యాలయంలో జరిగిన జాతీయ స్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో గురుకుల విద్యాలయ విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎస్సే రైటింగ్, క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారన్నారు. క్విజ్ జూనియర్ విభాగంలో కె.సుధాకర్, కె.కార్తికేయ, సీనియర్ విభాగంలో సుశాంత్‌స్వరూప్ ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. జాతీయ స్థాయిలో విజేతలను మంగళవారం ప్రకటించారన్నారు. విజేతలకు అటామిక్ మినరల్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఇంద్రజిత్తు పాత్ర చేతుల మీదగా మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిని విద్యార్థులను ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి, గైడ్ టీచర్ డాక్టర్ టి.రాంబాబు, డీసీవోసీ ప్రభావతమ్మ అభినందించారు.

జిల్లాలో ముగిసిన టెన్త్ పరీక్షలు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మంగళవారం ఆఖరి పరీక్షను 107 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు 20679 మంది హాజరుకాగా, ప్రైవేట్ విద్యార్థులు 194 మంది వచ్చినట్టు డీఈవో గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు.

సబ్బవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఐదు పరీక్షా కేంద్రాల్లో 929 మంది రెగ్యులర్, 11 మంది ప్రైవేటు విద్యార్థులు కలిపి 940 మందికి హాల్ టికెట్లు జారీ చేయగా, చివరి రోజు 983 మంది పరీక్షలు రాశారని ఎంఈవో-1 ఎం.లక్ష్మణరావు తెలిపారు. మాస్ కాపీయింగ్ లేకుండా పరీక్షలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

టైలరింగ్ కోర్సులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): టైలరింగ్ రంగంలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన మహిళలకు స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ కోసం ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పదో తరగతి చదివిన 18 నుంచి 40 ఏళ్ల మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన మహిళలకు మధ్యాహ్నం భోజన సదుపాయం, అనంతరం ప్రభుత్వం సర్టిఫికెట్ జారీ చేసి సంబంధిత రంగంలో ఉపాధి కల్పించనున్నట్టు చెప్పారు. మరిన్ని వివరాల కోసం 7780275922 ఫోన్ నంబరుకు సంప్రదించాలని ఆయన చెప్పారు.

రేపటి నుంచి జార్జిక్లబ్‌లో క్రీడా పోటీలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిక్లబ్‌లో గురువారం నుంచి క్రీడా పోటీలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జార్జిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే.జోగినాయుడు, బుద్ద కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా మాదిరి ఈ ఏడాది కూడా పోటీలు నిర్వహిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ రామచంద్రమూర్తి తెలిపారు. బుధవారం రాత్రి తొమ్మిది గంటలలోపు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు రేపు

కశింకోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి యూనిట్ల మంజూరుకు బ్యాంకు మేనేజర్లతో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో వీవీ.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మూడు సెట్ల దరఖాస్తు ధ్రువ పత్రాలను తీసుకురావాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, వాహనాల గురించి పెట్టుకున్న వారు డ్రైవింగ్ లైసెన్సు పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

సబ్బవరంలో...

సబ్బవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, ఇతర కార్పొరేషన్ల రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. 24 రుణాల కోసం 884 దరఖాస్తులు అందాయన్నారు. వీరికి ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అత్యధికంగా సబ్బవరం నుంచి 133, అత్యల్పంగా నల్లరేగులపాలెం నుంచి ఏడు దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుదారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

తుమ్మపాలలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

తుమ్మపాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మేజరు పంచాయతీ తుమ్మపాలలో మంగళవారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా క్రికెట్ టీమ్‌లు పోటీల్లో పాల్గొనాలని సూచించారు. విజేత జట్లకు నగదు బహుమతులు అందించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పి.కన్నారావు, నాయకులు కర్రి బాబి, ఆడారి గోవిందరావు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

'మన ఊరు-మన బడి'పై విద్యార్థుల అవగాహన ర్యాలీ

కశింకోట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెం గ్రామంలో మన ఊరు-మన బడిని మనం కాపాడుదాం అనే అంశంపై మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అన్ని వసతులు కలిగిన పాఠశాల భవనాలు, ఇంగ్లీషు, తెలుగులో విద్యా బోధన, డిజిటల్ తరగతి బోధన, కంప్యూటర్ విద్య, ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, స్కూలు బ్యాగులు, నోట్ పుస్తకాలు ఇవ్వనున్నట్టు హెచ్ఎం వి.రమేశ్‌రావు తెలిపారు. నాణ్యమైన విద్యా బోధన కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూఏ కార్మికులు చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారం 32వ రోజుకు చేరుకున్నాయి. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, సస్పెన్షన్‌కు గురైన డ్రైవర్, కండక్టర్‌లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని నినాదాలిచ్చారు. దీక్షల్లో జీఎన్ఏ రావు, కేఎం రావు, టీటీ మూర్తిలు , ఎల్.రాము కూర్చున్నారు. వీరికి అసోసియేషన్ ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.

క్రీడా సామగ్రి, కథల పుస్తకాల వితరణ

పరవాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడచీపురుపల్లి, ధర్మారాయుడుపేట, గొరుసువానిపాలెం, రేఖవానిపాలెం, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలలకు ఎంవీ ఫౌండేషన్ క్రీడా సామగ్రి, కథల పుస్తకాలను సమకూర్చింది. విద్యార్థులల్లో సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు కథల పుస్తకాలు దోహదపడతాయని ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఎం.అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కనకేష్‌రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ ఎల్.సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ఎంవీ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ మల్లేశ్వరరావు, ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఆటిజం దూరం

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆటిజం.. ఈ సమస్య బారినపడిన చిన్నారుల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ఇదీ సమస్య అని ఇతిమిద్ధంగా చెప్పలేని పరిస్థితి. ఒక్కో చిన్నారిలో ఒక్కోరకమైన ఇబ్బందులు కనిపిస్తాయి. సమస్య పట్ల తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడంతో గుర్తించడం ఆలస్యమవుతోంది. ఆటిజాన్ని స్పెక్ట్రమ్ డిజార్డర్ అని. న్యూరల్ బిహేవియర్ డిజార్డర్ అని చెబుతారు. ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా ఏప్రిల్ రెండో తేదీన ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

- నాలుగు నుంచి ఆరు శాతం మంది చిన్నారుల్లో ఎదురవుతున్న సమస్య
- న్యూరల్ బిహేవియర్, స్పెక్ట్రమ్ డిజార్డర్‌గా దీనికి పేరు
- సకాలంలో గుర్తించలేకపోతున్న తల్లిదండ్రులు
- పిల్లలను గమనించాలంటున్న నిపుణులు
- నేడు ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికా వంటి దేశాల్లో 20 శాతం ఆటిజం కేసులు నమోదవుతుండగా, మన దేశంలో ఐదు శాతానికి పైగానే నమోదవుతున్నట్టు చెబుతున్నారు. దీని బారిన పడుతున్న చిన్నారుల సంఖ్య పెరుగుతుండడంతో 2007 నుంచి ప్రజల్లో ఆటిజంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆటిజం అంటే..?

ఆటిజం అంటే ఒక్క మాటలో చెప్పడం కష్టం. ఈ సమస్య బారినపడిన చిన్నారుల్లో ఒక్కో లక్షణం కనిపిస్తుంది. ప్రవర్తనలో మార్పులతో కూడిన వ్యాధిగా చెప్పవచ్చు. శరీరంలోని కొన్ని భాగాల్లో ఎదుగుదల తక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణ పిల్లలతో పోలిస్తే ఆటిజం బారినపడిన చిన్నారుల వ్యవహారశైలి భిన్నంగా ఉంటుందని, దీనిని బట్టి వ్యాధిని గుర్తించేందుకు వీలుంటుందని చెబుతున్నారు.



ఇవీ లక్షణాలు..

ఆటిజం బారినపడిన చిన్నారులను కొన్ని లక్షణాలను గుర్తించేందుకు అవకాశం ఉంది. ఎవరితోనూ కలవకపోవడం, నేరుగా కళ్లల్లోకి చూడలేకపోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం, పిలిచినా పలకకపోవడం, ఒంటరిగా ఆడుకోవడం, చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తుండడం, హైపర్ యాక్టివ్‌గా ఉండడం, ఎక్కువ ఆందోళనకు గురవుతుండడం, వింత శబ్దాలు చేయడం, అకస్మాత్తుగా కోపం రావడం వంటి లక్షణాలుంటాయి.

వినిపించడం లేదనే...

ఆటిజం బాధిత చిన్నారులకు కేజీహెచ్‌లోని డిస్ట్రిక్ ఎర్లీ ఇంట్రివెన్షన్ సెంటర్‌లో వైద్య సేవలందిస్తారు. కొన్ని ప్రైవేటు సంస్థలు, ఆస్పత్రుల్లో వైద్య సేవలందుతున్నాయి. సుమారు 90 శాతం మంది తల్లిదండ్రులు మూడేళ్లలోపే చిన్నారుల్లో ఈ సమస్యను గుర్తించి తీసుకువస్తుంటారు. వీరంతా చిన్నారులకు వినపడడం లేదనే చెబుతుంటారని కానీ, వినికిడి సమస్య సాధారణంగానే ఉంటుందని, స్పందించే గుణం సరిగా ఉండదని వైద్యులు చెబుతున్నారు.



అప్రమత్తం కావాల్సిందే..

ఆటిజం సమస్యతో బాధపడే చిన్నారులను రెండేళ్లలోపే గుర్తించడం సాధ్యమని కేజీహెచ్‌లోని డీఐసీ పీడియాట్రిక్ వైద్యులు డాక్టర్ సంధ్యారాణి చెబుతున్నారు. అమ్మ, కావాలి, ఇవ్వు వంటి చిన్నచిన్న పదాలు కూడా మాట్లాడలేకపోతే వెంటనే అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. రెండేళ్లలోపు చిన్నారులు ఈ పదాలు మాట్లాడతారని, ఇవి రాకపోయినా, పైన పేర్కొన్న లక్షణాలున్నా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచిస్తున్నారు.

ఇవీ కారణాలు..

ఆటిజం సమస్య జన్యుపరమైన కారణాల వల్ల వస్తుంది. అతి తక్కువ కేసుల్లో గర్భధారణ సమయంలో ఇన్‌ఫెక్షన్ల బారిన పడినా, గర్భిణిగా ఉన్నప్పుడు తీవ్రమైన ఉద్వేగాలకు లోనైనా పుట్టే పిల్లలకు ఆటిజం వచ్చే అవకాశం ఉంది. పిల్లల్లో మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు, అందులో స్రవించే సెరటోనిన్, డోపమైన్ వంటి రసాయనాలు తగినంత విడుదల కాకపోయినా, నెలలు నిండకుండా జన్మించినా, బాల్యంలో పిల్లలతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడపకపోయినా, స్క్రీన్ టైమ్, ఇంట్లో పిల్లలు ఒంటరిగా ఉన్నా దీని బారినపడే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఇదీ చికిత్స..

ఆటిజం బారినపడిన చిన్నారులకు లక్షణాలను బట్టి మైల్డ్, మోడరేట్, సివియర్‌గా విభజించి వైద్య సేవలు అందిస్తారు. స్క్రీనింగ్ చేసి విభజిస్తారు. సమస్య తీవ్రతను బట్టి స్పీచ్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్, ఆక్యుపేషనల్ థెరపీ, సెన్సార్ స్టిములేషన్ వంటి పద్ధతులను అనుసరించి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తారు.

సత్వరం గుర్తించడం కీలకం



ఆటిజం సమస్యను సత్వరం గుర్తించడం కీలకం. ఆలస్యమైతే వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. కేజీహెచ్‌కు ప్రతినెలా పది కేసులు వస్తుంటాయి. సమస్య తీవ్రతను బట్టి వైద్యం అందిస్తాం. గర్భిణిగా ఉన్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల కొంతవరకు సమస్యకు దూరం కావచ్చు. జన్యుపరమైన కారణాలతో వచ్చే సమస్యను ఏమీ చేయలేం. ఆటిజంతో బాధపడే చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. సమస్యను గుర్తించిన తరువాత కొన్ని వారాల పాటు కౌన్సెలింగ్, థెరపీ చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం చిన్నారులు ఇబ్బందులను ఎదుర్కొనాల్సి ఉంటుంది.

\- డాక్టర్ హరిక, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మిరియాలకాలనీకి చెందిన వృద్ధుడు అదృశ్యమైనట్టు పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. మిరియాలకాలనీకి చెందిన వేపా అచ్యుత రామకృష్ణశర్మ తండ్రి అప్పారావు గత ఏడాది అక్టోబరు 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. సుమారు ఐదు నెలలపాటు ఎదురు చూసినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా రహిత జిల్లాగా అనకాపల్లి

- కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాను నాటుసారా రహితంగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవోదయం-2.0 అధికారుల సమన్వయ కమిటీ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. నాటుసారాను పూర్తిగా నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం-2.0 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయిలో పోలీసు, అటవీ, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సారా తయారీదారులను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నవోదయం-2.0ను సమర్థంగా అమలు చేసేందుకు గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సారా రహిత సమాజ స్థాపన కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందులో మహిళలను భాగస్వాములను చేయాలని సూచించారు. సారా విక్రయదారులను గుర్తించి ప్రత్యామ్నాయంగా గొర్రెలు, మేకల పెంపకం, చిన్నపాటి వ్యాపారాలు చేసుకొనేందుకు రుణాలు మంజూరు చేయించాలని ఆమె చెప్పారు. సమావేశంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ సుర్జిత్‌సింగ్, జిల్లా సూపరింటెండెంట్ వి.సుధీర్, డీఎఫ్‌వో శామ్యూల్, ఏఎస్పీ (క్రైమ్) మోహన్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాఫీ పూతకు కలిసొచ్చిన వర్షాలు



చినబరడలో విరబూసిన కాఫీ పూత

చింతపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో మార్చిలో కురిసిన వర్షాలు కాఫీ పూతకు అనుకూలించాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గిరిజన ప్రాంతలో సాధారణంగా ఫిబ్రవరి, మార్చిలో వర్షాలు కురుస్తాయి. కాఫీ పంటకు ఈ వర్షాలు అత్యంత కీలకం. మార్చిలో కురిసిన వర్షాలు కాఫీ దిగుబడులపై ప్రభావం చూపుతాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో 12.6 మిల్లీ మీటర్లు, మార్చిలో 21.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మార్చిలో కురిసిన వర్షాలకు ప్రస్తుతం కాఫీ తోటల్లో విస్తారంగా పూత వచ్చింది. ఏప్రిల్‌లో కురిసే వర్షాలు పూత దశ నుంచి పిందె దశకు దోహదపడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాఫీ దిగుబడులు పెరగాలంటే గిరిజన రైతులు తోటల్లో వేసవి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ చెట్టి బింధు తెలిపారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న శాప్ ఎండీ



అమ్మవారికి పూజలు చేస్తున్న గిరీషా

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారినియ 'శాప్' వైస్ చైర్మన్, ఎండీ పీఎస్ గిరీషా మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు ఆలయానికి వచ్చిన ఆయనకు ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపలి రాంబాబు స్వాగతం పలికారు. అమ్మవారికి పూజలు చేసిన తరువాత అర్చకులు ఆశీర్వచనం అందించారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల ఊరేగింపు



ఘటాలతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న భక్తులు

మాడుగుల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారి ఘటాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం

- అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, చెరువులు, పంట కాలువల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని గుండుపాలెం గ్రామంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పింఛన్లు ఉదయం ఏడుగంటల లోపే పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులను సూచించారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 41,528 మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. గొలుగొండ మండలంలో 170 సిమెంట్ రోడ్లు వేసేందుకు నిధులు కేటాయించామన్నారు. అనంతరం కొత్తూరు గ్రామంలో తలుపులమ్మ అమ్మవారికి స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు రవివర్మ వెండి కిరీటం బహూకరించడంతో దానిని అయ్యన్న, ఆయన సతీమణి పద్మావతి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ చేతుల మీదుగా అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీ రోజీ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నాయకుడు రాజాన వీరసూర్యచంద్ర, మరో డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, పార్టీ మండల నాయకులు కొల్లి సత్తిబాబు, కొల్లి రాంబాబు, భీమిరెడ్డి సత్యనారాయణ, చినబ్బాయి, కామిరెడ్డి గోవింద్, కర్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- బల్క్‌డ్రగ్ పార్కు, స్టీల్ ప్లాంట్‌లతో 50 వేల మందికి ఉద్యోగాలు
- హోం మంత్రి వంగలపూడి అనిత



అరట్లకోటలో సీసీ రోడ్డును ప్రారంభించిన మంత్రి అనిత. చిత్రంలో కూటమి నేతలు గెడ్డం బుజ్జి, పెదిరెడ్డి చిట్టిబాబు, తదితరులు

పాయకరావుపేట/ పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వ సమాన ప్రాధాన్యం ఇస్తున్నదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని అరట్లకోటలో రూ.31 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను, పాయకరావుపేట పెదవీర్ల పంజా వీధిలో రూ.10 లక్షలు, దేవీనగర్‌లో రూ.30 లక్షలు, చెక్కా నగర్‌లో రూ.20 లక్షలు, షీలా నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ఒక్క గ్రామంలో కూడా సీసీ రోడ్డు వేయలేదని, తాము సర్పంచులుగా ఎందుకు ఎన్నికయ్యామా అని వైసీపీకి చెందిన వారే బాధపడ్డారని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నిధుల కొరత వున్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. కోట్లాది రూపాయలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మించామని, పంచాయతీలకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ కృషి వల్ల నక్కపల్లి వద్ద బల్క్‌డ్రగ్ పార్కు, ప్రైవేటు రంగంలో భారీ స్టీల్ ప్లాంట్ వస్తున్నాయన్నారు. ఇవి ఏర్పాటైతే సుమారు 50 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. అరట్లకోటలో రెండు నెలల్లో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందిన బార్కుల నాగేంద్ర కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కె.ఎల్. యూనివర్సిటీలో చదువుతూ చనిపోయిన తూము వెంకట దుర్గా ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబ్బులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, అరట్లకోట సర్పంచ్ పులగపూరి అప్పలనర్స, కూటమి నాయకులు తోట నగేశ్, గొర్లె రాజుబాబు, పెదిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, యాళ్ల వరహాలు, మజ్జూరి నారాయణరావు, పీఆర్ డీఈఈ వై.హరి, ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, ఈవోపీఆర్‌డీ చంద్రశేఖరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి రైతుకు తెగుళ్ల ఘాటు

... 5వ పేజీ తరువాయి

ఎండు మిర్చి దిగుబడి వస్తుంది. గత ఏడాది (2023-24) క్వింటా మిర్చి (నాణ్యత, రకాన్నిబట్టి) రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పలికింది. దీంతో ఈ ఏడాది (2024-25) కొత్తగా పలువురు రైతులు మిర్చి సాగుకు ఆసక్తి చూపారు. సాగుకు పొలాన్ని సిద్ధం చేయడం నుంచి విత్తనం, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కాయ కోత, ఇతర కూలి ఖర్చులు కలుపుకుంటే ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతుంది. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చి, క్వింటా సగటున రూ.12 వేల ధర పలికితే.. ఖర్చులుపోను రూ.60-80 వేల వరకు మిగులుతాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి తలకిందులైంది. నారు నాటిన తరువాత నెల రోజుల వరకు మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో మిర్చి కాపు ఆశాజనకంగా వుంటుందని రైతులు భావించారు. కానీ పూత దశలో ఒక్కసారిగా తెగుళ్లు దాడిచేశాయి. ముఖ్యంగా తెల్లదోమ ఆశించడంతో ఆకులు ముడుచుకుపోయి పూత సరిగా రాలేదు. వీటి నివారణకు ఎన్ని రకాల మందులు వాడినా తాత్కాలిక ఉపశమనమే తప్ప తెగుళ్ల బెడద తొలగలేదు. దీంతో పెట్టుబడి పెరిగింది.. దిగుబడి తగ్గింది. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు మించి రాలేదని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.80 వేల వరకు పెట్టుబడికాగా, పండి పంటను (ఎండు మిర్చి) విక్రయిస్తే రూ.60 వేలు కూడా రాలేదని వాపోయారు.



అరకొరగా కాసిన పండు మిరప కాయలను గ్రేడింగ్ చేస్తున్న రైతులు

ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

మళ్లేవారు. ఇంతలోనే గొడిచెర్ల జంక్షన్ వద్ద కారు రూపంలో మృత్యువు కబళించింది. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరు అయ్యారు. పోలీసులు మృతదేహాలకు నక్కపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

నిర్వాసితుల లేఅవుట్ భూముల పరిశీలన



పెదబోదిగల్లం వద్ద భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

నక్కపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లంలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల ఇళ్ల నిర్మాణం కోసం లే అవుట్ ఏర్పాటు చేయనున్న భూములను కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం పరిశీలించారు. నక్కపల్లి, పెదబోదిగల్లం గ్రామాలకు ఆనుకుని కారిడార్ నిర్వాసితుల కోసం 150 ఎకరాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 40 ఎకరాలు సిద్ధం చేశామని ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి చెప్పారు. లే అవుట్‌కు సంబంధించిన మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు.

తిరుపతి, షిర్డీ రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

వరకు బెర్తులు నిండిపోయాయి. అన్ని ఏసీ క్లాసులతోపాటు స్లీపర్ క్లాసు కోచ్‌లకు కూడా నిరీక్షణ జాబితా ఏర్పడింది. కొన్ని తేదీల్లో ఫస్ట్ ఏసీ బెర్తులు అంతంతమాత్రంగా అందుబాటులో ఉన్నాయి.

భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు ఫుల్

భువనేశ్వర్ నుంచి విశాఖ మీదుగా తిరుపతి వెళ్లే వారాంతపు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. ప్రతి శనివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22879), ప్రతి ఆదివారం నడిచే భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22871)లకు మే నెలాఖరులో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లలో ఒకటి, అరా బెర్తులు మినహా మిగిలినవి ఫుల్ అయిపోయాయి.

డబుల్ డెక్కర్, తిరుపతి ప్రత్యేక రైలుకు ఖాళీలు

వారానికి మూడు రోజులు అందుబాటులో ఉండే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌లో సీట్లు ఖాళీఉన్నాయి. అలాగే ప్రతి సోమవారం విశాఖ నుంచి తిరుపతికి ఏప్రిల్ 28 వరకు ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలుకు (08583) బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లకు బెర్తులు ఫుల్

ప్రతి గురువారం విశాఖ నుంచి బయలుదేరే షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503)కు మే నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కనీసం వారానికి రెండు రోజులు అందుబాటులో ఉండేలా ఫ్రీక్వెన్సీ పెంచాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు పెడచెవిన పెడుతున్నారు. ప్రతి ఆదివారం విశాఖలో బయలుదేరి మన్మాడ్ మీదుగా నడిచే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (22847)లో కూడా మే నెలాఖరు వరకూ బెర్తులు నిండిపోయాయి.

పరిశ్రమల ఖిల్లాగా జిల్లా

... 5వ పేజీ తరువాయి

గ్యాస్ ఉత్పత్తి పరిశ్రమ రానున్నది. డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రూ.1,100 కోట్లు, అలియన్స్ టైర్స్ రూ.750 కోట్లు, మెగా ఫ్రూట్ ప్రొక్యూరింగ్ లిమిటెడ్ కంపెనీ రూ.185 కోట్లు, గోదావరి ల్యాబ్స్ ప్రైవేటు లిమిటెడ్ రూ.300 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చాయి. ఆయా సంస్థల ప్రతినిధులు భూ కేటాయింపుల కోసం చేసుకున్న దరఖాస్తులను ఏపీఐఐసీ అధికారులు పరిశీలిస్తున్నారు.

నక్కపల్లి కారిడార్‌లో స్టీల్‌ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్కు

విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నక్కపల్లి మండలంలో గతంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో భారీ పరిశ్రమల ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. జాతీయ రహదారికి అతి చేరువలో వుండడం, కాకినాడ, విశాఖ పోర్టులకు సమీపంలో ఉండడంతో ఇక్కడ పరిశ్రమల స్థాపనకు ప్రముఖ కంపెనీలు ముందుకు వస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్స్ ముందుకు వచ్చాయి. తొలిదశలో రూ.69,035 కోట్ల పెట్టుబడితో 7.3 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు కానున్న ఈ స్టీల్ ఫ్యాక్టరీ కోసం నక్కపల్లి సెజ్‌లో 2,200 ఎకరాలు కేటాయించారు. తొలిదశ పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 55 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇదే మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు కానున్నది. ఇంకా మరికొన్ని కంపెనీలు భూముల కోసం దరఖాస్తు చేసుకున్నాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	118.00
లైవ్ ధర	138.00
విత్ స్కిన్	246.00
స్కిన్ లెస్	256.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444